RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 17 | ISSUE: 279 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 04-5-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక : 279 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 04-5-2026 | పేజీలు : 8 | రూ: 2/-



## కంచుకోటను బద్దలుకొట్టిన కమలం

### అమిత్ షా కనుసన్నల్లో పన్నా ప్రముఖ్ వ్యవస్థ

### మహిళలు, యువత, రైతులే లక్ష్యంగా మేనిఫెస్టో..-స్థానిక ఎమ్మెల్యేలను టార్గెట్ చేసి..



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

టీఎంసీ కంచుకోటను భాజపా బద్దలు కొట్టింది. 15 ఏళ్లుగా ఎదురులేకుండా బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీకి గట్టి షాకిచ్చింది. గత రెండు దఫాల్లో సాధ్యంకాని విజయం ఈసారి కమలనాథుల వశమైంది. పశ్చిమ బెంగాల్‌లో అనుసరించిన పదునైన వ్యూహం ఈసారి పార్టీకి కచ్చితమైన ఫలితాన్ని తీసుకొచ్చింది. భాజపా అగ్రనేత అమిత్‌షా అన్నీ తానై ఈ ఎన్నికల్లో పార్టీని నడిపించారు.

**ఎదురుదెబ్బలను విశ్లేషించుకొని..**

2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అంచనాలను తలకిందులు చేస్తూ మమతా బెనర్జీ సత్తా చాటారు. నాడు భాజపా 10,000 కంటే తక్కువ ఓట్ల తేడాతో 40 స్థానాలు, 5,000 కంటే తక్కువ ఓట్లతో 20 స్థానాలు కోల్పోయి 77 స్థానాలకే పరిమితమైంది. దీంతో దీదీని ఓడించడం అంత సులువు కాదని గ్రహించిన భాజపా వ్యూహాన్ని మార్చుకొంది. సునీల్ భన్సల్ పార్టీ ఇన్‌ఛార్జిగా.. వ్యవస్థీకృత మార్పులు తీసుకొచ్చారు. అమిత్‌షాకు భన్సల్ నమ్మకస్తుడని పేరు. టికెట్ల పంపిణీ విషయంలో సెలబ్రిటీలు, ఫిరాయింపుదార్లకు ప్రాధాన్యం ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పట్టున్న పార్టీ నాయకులకు భాజపా పెద్దపీట వేసింది. ప్రతి బూత్‌స్థాయిలో 300 ఓట్లను సమీకరించగల వారికే టికెట్లు కేటాయించింది.

**అమిత్ షా కనుసన్నల్లో పన్నా ప్రముఖ్ వ్యవస్థ**

స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన చోట్ల పుంజుకోవడానికి బూత్ స్థాయి మేనేజ్‌మెంట్‌కు తెరతీసింది. పోలింగ్ కేంద్రాల్లో బలమైనవి, దృష్టిపెట్టాల్సినవి, బలహీనమైనవి అంటూ మూడు వర్గీకరణలు చేసింది. ఇక్కడే 'పన్నా ప్రముఖ్' వ్యవస్థ పనిచేసింది. ప్రతి కార్యకర్త 10–15 కుటుంబాలతో సత్సంబంధాలు నెరిపి 30–60 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేలా చేశారు. దీంతోపాటు భాజపా 'శక్తికేంద్రాలు'గా వర్గీకరించుకొన్న క్లస్టర్ల నుంచి అధిక పోలింగ్ ఉండేలా

తరువాయి 2లో..

## ఏపీ ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్..

- సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- ఏపీ ఉత్పత్తులను గ్లోబల్ బ్రాండ్లుగా నిలపాలన్న సీఎం చంద్రబాబు
- పారిశ్రామిక క్లస్టర్లకు రోడ్డు, రైల్, పోర్టు కనెక్టివిటీ తప్పనిసరి
- రవాణా వ్యయం తగ్గింపు అత్యంత కీలకమని స్పష్టీకరణ
- పరిశ్రమలు, మౌలిక వసతులు, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి
- ప్రతి జిల్లాలో మెగా ఇండస్ట్రియల్ పార్క్.. యువతకు ఉపాధి కల్పన



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో తయారయ్యే స్థానిక ఉత్పత్తులను ప్రపంచ స్థాయి బ్రాండ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్పత్తుల నాణ్యతను పెంచడంతో పాటు, వాటికి ప్రపంచ మార్కెట్ కల్పించేందుకు అవసరమైన పటిష్ఠమైన ప్రణాళికలతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఏపీ సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో 'ప్రొడక్ట్ పర్ఫెక్షన్ క్లస్టర్ల' ఏర్పాటుపై ఆయన

తరువాయి 2లో..



## కింగ్ మేకర్ కాదు 'కింగే'..

తమిళనాడు ఎన్నికల్లో
సంచలనం సృష్టిస్తున్న
నటుడు విజయ్ పార్టీ
ఫస్ట్ మూవీ ఫ్లాప్.. ఫస్ట్ ఎలక్షన్ హిట్..
విమర్శించిన వాళ్లే శెభాష్ అనేలా..

### పోటీ చేసిన రెండు చోట్లా 'విజయ్'మే!

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) చీఫ్ విజయ్(ఎఅయిఖ౦) సంచలనం సృష్టించారు. తమిళ రాజకీయాల్లో అసాధ్యమనుకున్నది సుసాధ్యం చేసి చూపించారు. పార్టీని స్థాపించిన కేవలం రెండేళ్లకే చరిత్ర లిఖించారు. టీవీకే ఏర్పాటు తర్వాత తొలిసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలతో 'విజిల్' వేయించి మెజార్టీ స్థానాలు గెలవడం ద్వారా అటు సినిమాల్లోనే కాదు.. ఇటు పాలిటిక్స్‌లోనూ 'సూపర్ హిట్' కొట్టారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగిన విజయ్.. రెండు చోట్లా తన సమీప ప్రత్యర్థులను ఓడించి సత్తా చాటారు.

**కింగ్ మేకరే అన్నారు.. కానీ..!**

కొన్ని ఎగ్జిట్‌పోల్స్, కొందరు రాజకీయ విశ్లేషకులు ఈ ఎన్నికల్లో విజయ్ ప్రభావం అంతగా ఏమీ ఉండకపోవచ్చని.. ఆయన ఓట్లు చీలుస్తారని, ఒకవేళ హంగ్ వస్తే ఆయన

తరువాయి 2లో..

## గత ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్ల అప్పు భారం మోపింది: నారాయణ




**నెల్లూరు, సిటిజన్ టైమ్స్**

నెల్లూరు జిల్లాలో అభివృద్ధి పనులకు మంత్రి నారాయణ శ్రీకారం చుట్టారు. దస్తగిరి నగర్‌లో రూ.1.43 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నెల్లూరు నగరంలో

తరువాయి 2లో..

## కంగ్రాచ్యులేషన్స్ విజయ్

### ఏపీ మంత్రి నారా లోకేశ్



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం దిశగా దూసుకుపోతూ, రాజకీయ అరంగేట్రంలో సత్తా చాటిన నటుడు విజయ్‌కు ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. విజయ్ ఎన్నికల ప్రస్థానం అద్భుతంగా మొదలైందని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా లోకేశ్ స్పందిస్తూ, "తమిళనాడులో

తరువాయి 2లో..

## ఒమన్‌లో చిక్కుకున్న ఏపీ మహిళ.. సురక్షితంగా రప్పిస్తున్న ప్రభుత్వం



- ఒమన్‌లో చిక్కుకున్న అన్నమయ్య జిల్లా మహిళ షెహనాజ్
- 'నన్ను కాపాడండి' అంటూ పవన్ కల్యాణ్‌కు వీడియో సందేశం
- వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం కార్యాలయం, ఏపీ ప్రభుత్వం
- ఏపీఎన్ఆర్‌టీఎస్ జోక్యంతో ఫలించిన చర్చలు
- ఈ నెల 7న సురక్షితంగా సొంతూరుకు తిరిగి రానున్న బాధితురాలు

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఉపాధి కోసం ఒమన్ వెళ్లి, అక్కడ యజమాని వేధింపులకు గురై నిర్బంధంలో చిక్కుకున్న ఏపీకి చెందిన మహిళను రాష్ట్ర ప్రభుత్వం సురక్షితంగా వెనక్కి తీసుకొస్తోంది. అన్నమయ్య జిల్లా వాయల్పాడుకు చెందిన దుదేకుల షెహనాజ్, ప్రభుత్వ జోక్యంతో ఈ నెల 7న తిరిగి సొంతూరుకు రానున్నారు. ఏపీ నాన్–రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీఎస్), డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయం ప్రత్యేక చొరవతో ఈ సమస్యకు ముగింపు పడింది. గత నవంబర్‌లో ఉపాధి కోసం మస్కట్ వెళ్లిన షెహనాజ్, అక్కడి పని నచ్చక తిరిగి రావాలనుకున్నారు. కానీ, యజమాని ఆమెను అనుమతించకుండా నిర్బంధించి, ఫోన్ లాక్కున్నారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన షెహనాజ్... "పవన్ కల్యాణ్ అన్న, నన్ను కాపాడండి. ఇక్కడ కొడుతున్నారు, తిండి, నీళ్లు కూడా ఇవ్వడం లేదు. నా ప్రాణాలకు

తరువాయి 2లో..



## ఎడిటోరియల్

# గొడ్డలి...వైసీపీని గట్టిగానే గుచ్చుకుంటోందా ?

వైసీపీ రాజకీయ వ్యూహాలు ఏంటో కానీ స్పందించాల్సిన వాటి మీద చాలా లేటుగా రియాక్ట్ అవుతారని అంటారు. అప్పటికే జరగాల్సినది జరిగిపోతుందని కూడా పార్టీలోనూ అంతర్మథనం చెందుతూ ఉంటారు. ప్రభుత్వంలో ఉన్నపుడు కానీ అంతకు ముందు విపక్షంలో ఉన్నపుడు కానీ ప్రత్యర్థులు చేసే ఘాటు విమర్శల మీద వెంటనే రియాక్ట్ కాకపోవడం వల్ల భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వచ్చిందని వైసీపీ నేతలు గుర్తు చేసుకుంటూ ఉంటారు. రాజకీయాల్లో టైం టైమింగ్ ఈ రెండూ చాలా ముఖ్యం. ఈ విషయంలో వైసీపీ ఎపుడూ వెనకబాటుతోనే ఉంటోంది అని అంటున్నారు. తెలుగుదేశం పార్టీ వైసీపీని విమర్శించే విషయంలో ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాలతో సిద్ధంగా ఉంటుంది. అధికారంలో వైసీపీ ఉన్నప్పుడు అయిదేళ్ళూ జగన్ ని సైకో అంటూ వైసీపీని సైకో పార్టీ అని విపరీతంగా టీడీపీ ప్రచారం చేసింది. దానిని వైసీపీ సీరియస్ గా తీసుకోలేదు, ఫలితాలు వచ్చిన తరువాత ఏమి జరిగింది అన్నది బోధపడింది అని అంటున్నారు. ఇపుడు కొత్తగా గొడ్డలి పార్టీ అని వైసీపీకి పేరు పెట్టి టీడీపీ పెద్ద ఎత్తున జనంలోకి దానిని ప్రచారం చేస్తోంది. ఇది చాలా రోజులుగా జరుగుతోంది. అయితే వైసీపీ ఇపుడు ఆలస్యంగా మేలుకొంది. అందుకే వరసబెట్టి తమ పార్టీకి చెందిన మాజీ మంత్రుల చేత కౌంటర్లు ఇప్పిస్తోంది. ఇక మాజీ మంత్రి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధనరెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ తమది గొడ్డలి పార్టీ అని ప్రచారం చేస్తున్న చంద్రబాబు మీద తీవ్ర విమర్శలు చేశారు. మామ పార్టీకి గునపం పెట్టి వెన్నుపోటు పొడిచింది బాబు కాదా అని ప్రశ్నించారు. ఆ మీదట ప్రతీ ఎన్నికల్లో ప్రజలకు హామీలు ఇవ్వడం వాటిని నెరవేర్చకుండా గునపంతో జనాలను వెన్నుపోటు పొడవడం కూడా బాబుకు అలవాటే అని ఆయన ఫైర్ అయ్యారు. మీ పార్టీ గునపం పార్టీ అందుకే గునపం గుర్తునే పెట్టుకోవాలని ఆయన సూచించారు. ఆయన తరహాలో మరింత మంది మాజీ మంత్రులు నాయకులు కూడా టీడీపీ మీద విమర్శలు చేస్తున్నారు. ఈ తరహా విమర్శలు కానీ ప్రచారం కానీ న్యూట్రల్ సెక్షన్లలో తీవ్రమైన ప్రభావం చూపిస్తాయని అంటున్నారు విద్యావంతులు మేధావులు అలాగే చదువరులు ఉద్యోగస్తులు తటస్థులలో వీటి మీద చర్చ సాగుతూ ఉంటుంది. ఈ సెక్షన్లు ఎన్నికల సమయంలో కీలకంగా మారుతారు. మౌత్ పబ్లిసిటీ ద్వారా వీరి అభిప్రాయాలు మిగిలిన జనాలకు చేరి ఫలితం మీద పడుతుంది అన్న విశ్లేషణలు ఉన్నాయి. అందుకే టీడీపీ వైసీపీ విషయంలో ఎప్పటికపుడు కొత్త ఎత్తుగడలతో ముందుకు సాగుతోంది. కానీ వైసీపీ మాత్రం ఇవేమీ పట్టినట్లుగా ఉండడం వల్ల ఇబ్బంది పడుతోంది అని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. ఇపుడు గొడ్డలి అంటే వైసీపీ గుర్తుకు వచ్చేలా ఉధృతమైన ప్రచారం సాగిన నేపథ్యంలో వైసీపీ గునపం అని వెన్నుపోటు అని టీడీపీ మీద కౌంటర్లు వేస్తోంది. మరి ఇవి జనంలోకి ఏ మేరకు వెళ్తాయి ఒక వేళ వెళ్తే ఈ రెండింటి మీద జనాలలో చర్చ జరిగి వారు ఏ వైపు మొగ్గు చూపిస్తారు అన్నది చూడాల్సి ఉంది. ఇవన్నీ పక్కన పెడితే గొడ్డలి పార్టీ అని అంటూంటే వైసీపీకి ఎక్కడో గట్టిగా గుచ్చుకుంటోంది అని అంటున్నారు. మరి వైసీపీ సున్నితత్వం మీదనే టీడీపీ దెబ్బ కొడుతూ రాజకీయ రచ్చకు తెర తీస్తోందా అన్నదే అసలైన చర్చ.

# కంచుకోటను బద్దలుకొట్టిన కమలం

నిర్దేశించారు. ఇక అమిత్‌షానే స్వయంగా 152కు పైగా నియోజకవర్గాల్లోని 44,000 పోలింగ్ కేంద్రాల పరిధిలో జరిగిన సమావేశాలను పర్యవేక్షించారంటే భాజపా ఏ స్థాయిలో దృష్టిపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. పన్నా ప్రముఖ్ నెట్‌వర్క్‌ను సునీల్ భన్సల్ చూసుకోగా.. బూత్ స్థాయి సమన్వయ బాధ్యతలను భూపేంద్ర యాదవ్ స్వీకరించారు. ఫలితంగా బెంగాల్‌లో రికార్డ్ స్థాయిలో దాదాపు 92శాతం పోలింగ్ నమోదైంది. ఇది భాజపాకు కచ్చితంగా కలిసొచ్చింది. బూత్ స్థాయి సమావేశాల్లో కార్యకర్తలు మమత సర్కారు వైఫల్యం, శాంతి భద్రతల పరిస్థితి, బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు, ఆర్జీకర్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచారం వంటివి ప్రస్తావించారు. ఇక ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలి తల్లికి కూడా పానిహటి నుంచి భాజపా టికెట్ కేటాయించి.. ఆ అంశాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చింది. దీంతో మమతా విజయావకాశాలను దెబ్బకొట్టినట్లయ్యింది. పశ్చిమ బెంగాల్‌లో 70శాతం ఉన్న హిందూ ఓటర్ల ఏకీకరణే లక్ష్యంగా భాజపా పనిచేసింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను దృష్టిలోపెట్టుకొని వ్యూహాలను అమలు చేసింది.

**స్థానిక ఎమ్మెల్యేలను టార్గెట్ చేసి..**

2021 ఎన్నికల వేళ నేరుగా మమతా బెనర్జీని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేసి భాజపా దెబ్బతింది. ఈసారి మాత్రం ఆ తప్పు చేయలేదు. స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, అవినీతిని లక్ష్యంగా చేసుకొని భాజపా శ్రేణులు ప్రచారం చేశాయి. 220 నియోజకవర్గాల్లోని టీఎంసీ ఎమ్మెల్యేలపై 'ఛార్జిషీట్లు' విడుదల చేసి ప్రజల్లోకి తీసుకెళ్లారు. 10,000 కిలోమీటర్ల మేరకు భాజపా పరివర్తన్ యాత్రను చేపట్టింది. ఫలితంగా 77 మంది అభ్యర్థులను టీఎంసీ మార్చుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది.

**కలిసొచ్చిన మమత ఇబ్బందులు..**

ఈసారి ఎన్నికల్లో మమతా బెనర్జీకి మొదటి నుంచి అనుకూలించలేదు. ఎన్నికల తేదీలు ప్రకటించిన వెంటనే టీఎంసీ అనుకూల అధికారుల బదిలీలు, ఐప్యాక్‌పై ఈడీ దాడులు దీదీని ఉక్కిరిబిక్కిరి చేశాయి. దీనికితోడు ప్రతి 140 మంది ఓటర్లకు ఒక సిబ్బంది చొప్పున మొత్తం 2.4 లక్షల మంది కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. ఈ నిర్ణయంతో పశ్చిమబెంగాల్‌లో అధికార పార్టీల కార్యకర్తలకు సహజంగా ఉండే దూకుడుకు కళ్లెం వేసినట్లైంది. దీనికితోడు సర్ విషయంలో న్యాయస్థానాల వద్ద మమత సర్కారు చేసిన తీవ్ర వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీశాయి.

**మహిళలు, యువత, రైతులే లక్ష్యంగా మేనిఫెస్టో..**

పశ్చిమబెంగాల్‌లో మహిళా ఓటర్లను ఆకట్టుకొన్న పార్టీకే విజయం లభిస్తుంది. ఇప్పటికే టీఎంసీ నుంచి వారికి లక్ష్మీభాండార వంటి పలు పథకాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో మహిళా సాధికారతే తమ మ్యానిఫెస్టో లక్ష్యమంటూ భాజపా అగ్రనేత అమిత్‌షా ప్రకటించారు. అంతేకాదు, ప్రతి మహిళకు నెలకు రూ.3,000 ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మమతా సర్కారు ఇస్తున్న దానికిది రెట్టింపు. గర్భిణులకు రూ.21,000, మహిళలకు ఉచిత బస్సు, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్త్రీలకు 33శాతం రిజర్వేషన్, యువతకు నెలకు రూ.3,000 భృతి, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి ఏక మొత్తంగా రూ.15,000 మద్దతు ప్రకటించింది. వరిని క్వింటాల్ రూ.3,100కు కొనుగోలు వాగ్దానం, పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో రాష్ట్ర వాటా పెంచి రైతులకు ఏటా రూ.9,000 చెల్లించేట్లు ఇచ్చిన హామీలు ఆకర్షించాయి.

**ఉత్తర బెంగాల్‌పై పట్టు బిగించి..**

సహజంగానే ఉత్తరబెంగాల్‌లో భాజపాకు పట్టుంది. ఇక్కడ తేయాకు తోటల సంక్షోభంతో ఇబ్బందులు పడుతున్న రాజబోంగ్షీల సమస్యలపై పార్టీ ఈసారి దృష్టిపెట్టింది. వీరి సంఖ్య 10 లక్షలకు పైగానే ఉంటుంది. ఇక్కడ 2 శాతం ఓట్లు పెరిగినా.. ఈ ప్రాంతంలో తమ సీట్లను 40కు పైగా పెంచుకొనే అవకాశాన్ని గ్రహించి వాడుకొంది. స్వయంగా అమిత్‌షా ఈ ప్రాంతంలో ప్రచారానికి వచ్చారు.

**మీకు మేమున్నాం..**

శాంతిభద్రత, సరిహద్దుల రక్షణ విషయంలో భాజపా తనదైన శైలిలో ప్రచారం చేసింది. పార్టీ అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే 100% కంచె నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించింది. పశువుల అక్రమ రవాణా, అక్రమ చొరబాట్లను అణచివేస్తామన్న హామీలు ఓటర్లపై పనిచేశాయి.

**స్థానిక నేతలే కీలకం..:** పశ్చిమబెంగాల్‌లో 'బయటవారు' అన్న ముద్ర పోగొట్టుకోవడానికి భాజపా ప్రచారంలో కూడా జాగ్రత్తలు తీసుకొంది. సువేందు అధికారి, సుకాంత్ మజుందార్, దిలీప్ ఘోష్ వంటివారిని ముందుంచి ప్రచారం చేయించింది. కీలక ప్రాంతాల్లో మాత్రం కేంద్ర నేతలే ప్రచారం చేశారు. కేంద్ర మంత్రి అమిత్ షా రాష్ట్రంలో ఏకంగా 66 ర్యాలీలు చేపట్టారు. ప్రధాని మోదీ 18 కార్యక్రమాల్లో, జేపీ నడ్డా 10 ర్యాలీల్లో ప్రచారాన్ని నడిపించారు.

# కింగ్ మేకర్ కాదు 'కింగే'..

కింగ్‌మేకర్ అవుతారంటూ రకరకాల అంచనాలను వెలువరించారు. కానీ, వాటన్నింటినీ తారుమారు చేస్తూ టీవీకే అనూహ్యంగా అత్యధిక స్థానాలు గెలుచుకొని ఆయన కింగ్‌గా అవతరించడం ఇప్పుడు దేశమంతా హాట్‌టాపిక్ అయింది. ఇప్పటివరకు వచ్చిన ఫలితాలను చూస్తే.. మొత్తం 234 సీట్లకు గాను టీవీకే 108 స్థానాల్లో గెలుపు/ఆధిక్యంలో కొనసాగుతుండగా.. అధికార డీఎంకే కూటమి 75 చోట్ల; అన్నాడీఎంకే కూటమి 51 చోట్ల గెలుపు/ఆధిక్యంలో ఉన్నాయి. ఈ అపూర్వ విజయంతో మంచి జోష్‌లో ఉన్న టీవీకే శ్రేణులు, నేతలు ప్రభుత్వ ఏర్పాటు దిశగా ముమ్మర కసరత్తు చేస్తున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే విజయ్ మే 7న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు వార్తలొస్తున్నాయి.

**తన కారు డ్రైవర్ కొడుకుకు సీటిచ్చి..**

విజయ్ దాదాపుగా సామాన్యులకే సీట్లు కేటాయించడం ద్వారా తనదైన మార్కు చూపించారు. రాజకీయ వారసత్వానికి భిన్నంగా ఆయన క్షేత్రస్థాయి కార్యకర్తలకే సీట్లు ఇచ్చి ప్రత్యేకతను చాటారు. తన వద్ద దాదాపు 30 ఏళ్లుగా కారు డ్రైవర్‌గా పనిచేసి, ప్రస్తుతం సహాయకుడిగా కొనసాగుతున్న రాజేంద్రన్ కుమారుడు శబరినాథన్‌ను చెన్నైలోని విరుగంబాక్కం నియోజకవర్గం నుంచి విజయ్ బరిలో దించగా.. డీఎంకే అభ్యర్థిపై ఆధిక్యంతో స్పష్టమైన విజయం దిశగా దూసుకెళ్తుండటం విశేషం.

**ఆటోడ్రైవర్ అపూర్వ విజయం..**

అలాగే, రోయపురం నియోజకవర్గంలో ఓ ఆటో డ్రైవర్‌కు విజయ్ సీటు ఇచ్చారు. ఈ స్థానం నుంచి బరిలో నిలిచిన ఆటో డ్రైవర్ కె.విజయ్ ధాము శక్తిమంతమైన రాజకీయ వారసత్వం కలిగిన వ్యక్తులనే ఓడించి అద్భుత విజయం సాధించారు. ఐదు సార్లు ఎమ్మెల్యే డా.జయకుమార్ (అన్నాడీఎంకే), మాజీ మంత్రి రెహ్మాన్ ఖాన్ తనయుడు సుబైర్ ఖాన్‌లను ఓడించి సరికొత్త రికార్డు నెలకొల్పారు. విజయ్ ధాముకు మొత్తంగా 59,091 ఓట్లు రాగా.. తన సమీప ప్రత్యర్థి, డీఎంకే అభ్యర్థిపై 14,249 ఓట్ల మెజార్టీతో గెలుపొందడం విశేషం. ఒక సామాన్య కుర్రాడు.. అవమానాలతో వెండితెరపై అడుగు పెట్టాడు.. కసి, నిరంతర సాధనతో తనని తాను చెక్కుకున్నాడు.. డ్యాన్సులు, ఫైట్లతో బాక్సాఫీస్ సామ్రాజ్యాన్ని శాసించాడు. మాములు నటుడిగా కనిపించిన వ్యక్తి.. నేడు కోట్ల మంది గొంతుకగా మారి రాజకీయ రంగంలో పెను సంచలనం సృష్టించాడు. అభిమానుల గుండెల్లో 'దళపతి'గా ముద్ర వేసుకున్న జోసెఫ్ విజయ్.. ఇప్పుడు 'తమిళగ వెట్రి కళగం'(టీవీకే) జన నాయకుడిగా (ఎఅయిఖఎ) తన కొత్త అధ్యాయాన్ని మొదలుపెట్టేందుకు సిద్ధమయ్యారు. రీల్ లైఫ్ హీరో నుంచి రియల్ లైఫ్‌లో రాజకీయ నాయకుడిగా ఎంట్రీలోనే ప్రభంజనం సృష్టించారు విజయ్. ఈ నేపథ్యంలో ఒకసారి ఆయన జర్నీని గుర్తుచేసుకుందామా..

**గదిలోనే చిన్నతనం..:** 1974 జూన్ 24న విజయ్ జన్మించారు. తల్లి శోభ గాయని, తండ్రి ఎస్ఏ చంద్రశేఖర్ దర్శకుడు. తొలినాళ్లలో కనీసం బాత్రూమ్ కూడా లేని చిన్న గదిలో విజయ్ తల్లిదండ్రులు నివాసం ఉండేవారు. అతడికి ఏడేళ్లు వచ్చేవరకు ఆర్థికంగా సతమతమవుతూనే ఉండేది ఆ కుటుంబం. ఆ తర్వాతే విజయ్ తల్లిదండ్రులు విజయ్‌కాంత్‌తో 'చట్టం ఒరు ఇరుట్టరై' తీశారు. ఈ సినిమా సూపర్ హిట్ అయింది. దీంతో వీరు ఆర్థికంగా స్థిరపడ్డారు.

**అందుకే మౌనంగా..**

విజయ్ చిన్నప్పుడు చాలా అల్లరి చేసేవాడు. ఎప్పుడూ నవ్వుతూ, అందరినీ ఆట పట్టించేవాడు. కానీ, ఆయన సోదరి మరణం విజయ్ జీవితాన్ని మార్చేసింది. తన చెల్లి విద్య అంటే విజయ్‌కు ప్రాణం. ఆమె చనిపోయిన తర్వాత విజయ్ ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారిపోయారు. నేటికీ ఆయన తెరపై అంత ఎనర్జీతో కనిపిస్తున్నా.. బయట మాత్రం చాలా మితభాషిగా ఉండటానికి ఆనాటి విషాదమే కారణమని విజయ్ తండ్రి చంద్రశేఖర్ చెబుతుంటారు.

**అప్పు చేసి తొలి సినిమా..**

చిన్నప్పటి నుంచి తండ్రిని చూసిన విజయ్ దృష్టి సినిమాల వైపు మళ్లింది. కానీ, 'మీవాడు హీరో ఏంటండీ, అసలు నటుడిగానే పనికిరాడు... బండమొహం వాడిది!' అంటూ ఎవరూ అవకాశాలు ఇవ్వలేదు. దీంతో రూ.60లక్షలు అప్పు చేసి విజయ్ తండ్రే దర్శకుడిగా ఆయనతో సినిమా తీశారు. అలా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు.

**మొదటి ప్రయత్నంలో నిరాశే..**

ఎన్నో ఆశలతో సినీ రంగంలోకి ఎంట్రీ ఇచ్చిన విజయ్‌కు తొలి ప్రయత్నంలో నిరాశే ఎదురైంది. తొలి సినిమా 'నాళయ తీర్పు' ఫ్లాప్. రెండు నెలలు కనీసం ఫ్రెండ్స్‌ను కలవడానికి కూడా విజయ్ బయటకు వెళ్లలేదు. చివరకు ఆ స్నేహితులే విజయ్‌కు అండగా నిలబడ్డారు. ఆయనలో ధైర్యం నింపారు.

**విమర్శించిన వాళ్లే శెభాష్ అనేలా..**

తనను తాను నిరూపించుకోవాలనుకున్న విజయ్.. డ్యాన్స్ పైన కసరత్తు మొదలుపెట్టాడు. కరాటే నేర్చుకున్నాడు. పగలూ, రాత్రీ ఇంకే ధ్యాసా లేకుండా సాధన చేశాడు. ఆ తర్వాత సరికొత్త విజయ్‌గా 'రసిగన్' అనే సినిమా చేశాడు. 1994లో విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఒకప్పుడు విమర్శించినవాళ్లే.. శెభాష్ అంటూ మెచ్చుకున్నారు.

**దళపతి విజయ్..:** 1990 చివర్లో, 2000 ప్రారంభంలో విజయ్ సినీరంగాన్ని శాసించారు. 'ఖుషి', 'గిల్లి' వంటి సినిమాలతో సూపర్ హిట్‌లు అందుకున్నారు. అప్పుడే అందరూ విజయ్‌ను 'ఇళయ దళపతి' అని పిలవడం ప్రారంభించారు. అనతికాలంలోనే ఆ పేరు దళపతిగా మారింది. విజయ్ నటించిన 'అదిరింది', 'సర్కార్', 'విజిల్', 'మాస్టర్' వంటి సినిమాలు ఆయన్ని ప్రేక్షకులకు మరింతగా చేరువ చేశాయి.

**కాలికి చెప్పులా ఉంటా..: విజయ్**

ప్రేక్షకుల అభిమానం సొంతం చేసుకున్న విజయ్.. వారికి సేవ చేయాలని రాజకీయ రంగంలోకి ప్రవేశించారు. 2024 ఫిబ్రవరి 2న 'తమిళగ వెట్రి కజగం' స్థాపించారు. ఈ పార్టీ ప్రారంభించాక 'లియో' ఆడియో రిలీజ్‌లో విజయ్ చేసిన వ్యాఖ్యలు ఆయనకు అభిమానులంటే ఎంత ప్రేమో తెలియజేశాయి. 'నాపై ఇంత అభిమానం చూపుతున్న మీకు ఏదైనా తప్పకుండా చేయాలనుంది. చేస్తా. మీ కాలికి చెప్పులా ఉండటానికి కూడా వెనకాడను. ఇప్పుడేం జరిగినా పట్టించుకోకుండా అందరూ ఓపికగా ఉండండి. విజయాన్ని అందుకోవచ్చు' అన్నారు. నాడు చెప్పినట్లు గానే నేడు విజయాన్ని అందుకున్నారు.

# బీజేపీ ఎన్డీఏ కూటమి ఘన విజయం....

**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మే 4:**

బిజెపి పార్టీ వెస్ట్ బెంగాల్, పాండిచ్చేరి, అస్సాంలో ఎన్డీఏ ఘన విజయం సాధించడం పట్ల సఖినేటిపల్లి మండల బిజెపి ఆధ్వర్యంలో సఖినేటిపల్లి సెంటర్ వద్ద పార్టీ శ్రేణులు ఘనంగా విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి వర్షం వ్యక్తం చేశారు. జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మాలే శ్రీనివాస్ నగేష్ మాట్లాడుతూ, ఈ విజయాలు మోదీజీ నాయకత్వంలో బిజెపి-ఎన్డీఏ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన ఆత్మనిర్భార్ భారత్, వికసిత్తు భారత్, స్వచ్ఛభారత్ దేశాన్ని మరింత బలోపేతం చేసే విధంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బోనం నాయుడు, చంపటి శివరామ కృష్ణంరాజు, ఇందుకూరి



సుబ్బరాజు, రావూరి బాబ్జి, బొమ్మిడి నరసింహస్వామి, అల్లూరి సత్యనారాయణ రాజు, పట్టపు సూర్యప్రకాశరావు, మాలే పండు, వర్మ, కొంతం శ్రీనివాసరావు, గెద్దాడ హరే రామ ప్రసాద్, ఆకన వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# ఏపీ ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్..

ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఈ క్లస్టర్లు చోదకశక్తులుగా మారాలని ఆకాంక్షించారు. పారిశ్రామిక క్లస్టర్లకు సమగ్రమైన లాజిస్టిక్స్ కనెక్టివిటీని అందించడం అత్యంత కీలకమని సీఎం నొక్కిచెప్పారు. ఉత్పత్తుల తయారీ కేంద్రాలకు రోడ్డు, రైలు, పోర్టు మార్గాలను అనుసంధానం చేయడం ద్వారా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. రవాణా వ్యయం తగ్గితేనే ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్‌లో పోటీతత్వం పెరుగుతుందని, అంతిమంగా పరిశ్రమలకు, రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. ఈ క్లస్టర్లకు నీరు, విద్యుత్, కోల్డ్ చైన్, వేర్ హౌసింగ్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ మ్యాపింగ్ జరగాలని సూచించారు. సమీక్షలో భాగంగా విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్లపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వ 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) పథకం కింద చేపట్టనున్న పారిశ్రామిక, కెమికల్ పార్కుల అభివృద్ధిపై సీఎం అధికారులతో చర్చించారు. 2026-27 నాటికి ఏర్పాటు కానున్న రేర్ ఎర్త్ మినరల్ పార్క్, ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, కంటైనర్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌తో పాటు 175 ఎంఎస్ఎంఈ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేసే అంశంపై ప్రణాళికలను పరిశీలించారు. పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు గ్రామీణ ప్రాంతాలకు, రైతులకు కూడా అందాలని సీఎం ఆకాంక్షించారు. పారిశ్రామిక క్లస్టర్లలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను భాగస్వామ్యం చేయడం ద్వారా రైతులు పండించిన పంటలకు మంచి ధర లభించేలా చూడాలన్నారు. 'పరిశ్రమలు-మౌలిక సదుపాయాలు-పర్యాటకం' అనే త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగాలని నిర్దేశించారు. ప్రతి జిల్లాలో ఒక మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసి స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు వాటికి అనుబంధంగా ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలని చంద్రబాబు సూచించారు. 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించి, ఏపీని అగ్రస్థానంలో నిలపాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా యువతలో నైపుణ్యాభివృద్ధి జరగాలని, ఇందుకోసం యూనివర్సిటీల్లో హైబ్రీడ్ విధానంలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టే ఆలోచన చేయాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, అటవీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఒమన్‌లో చిక్కుకున్న ఏపీ మహిళ.. సురక్షితంగా రప్పిస్తున్న ప్రభుత్వం

ప్రమాదం ఉంది" అంటూ కన్నీటితో ఓ వీడియో సందేశాన్ని సోషల్ మీడియా ద్వారా పంపారు. ఈ వీడియో చూసి చలించిపోయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆమెను వెంటనే వెనక్కి రప్పించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. దీంతో వారు తక్షణమే రంగంలోకి దిగి, షెహనాజ్ భర్త ద్వారా ఒమన్‌లోని ఏజెంట్‌తో మాట్లాడారు. అదే సమయంలో భారత విదేశాంగ శాఖ, మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయ అధికారులతో సంప్రదింపులు జరిపారు. మరోవైపు షెహనాజ్ భర్త అబూబకర్ ఏపీఎన్ఆర్‌టీఎస్‌కు ఫిర్యాదు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా వేగంగా స్పందించింది. మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయానికి లేఖ రాసింది. ప్రభుత్వ అధికారులు విడుదల చేసిన ప్రకటన ప్రకారం తొలుత ఏజెంట్ ఖర్చుల కింద రూ. 2 లక్షలు డిమాండ్ చేశారు. అయితే, స్థానిక పోలీసుల జోక్యంతో జరిగిన చర్చల తర్వాత ఏజెంట్ తన ఖర్చులతోనే షెహనాజ్‌ను ఆంధ్రప్రదేశ్‌కు పంపడానికి అంగీకరించారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు నాయుడు స్పందిస్తూ, వలస కార్మికుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. షెహనాజ్‌ను వెనక్కి తీసుకురావడంలో చొరవ చూపిన ఏపీఎన్ఆర్‌టీఎస్ అధికారులను ఆయన అభినందించారు.

# గత ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్ల అప్పు భారం మోపింది: నారాయణ

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ తీరుపై మండిపడుతూ.. గత పాలకులు రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం మోపడమే కాకుండా, పరిశ్రమలు తరలిపోయేలా చేశారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని విమర్శించిన ఆయన, ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని ధీమా వ్యక్తం చేశారు.

# కంగ్రాచ్యులేషన్స్ విజయ్

విజయ్ పార్టీ (టీవీకే) నమోదు చేస్తున్న అద్భుతమైన ఎన్నికల విజయాల పట్ల నా అభినందనలు. ఈ ఫలితాలు రాష్ట్ర ప్రజల మారుతున్న ఆకాంక్షలకు అద్దం పడుతున్నాయి. విజయ్ ఘనత తమిళనాడు రాజకీయ యవనికపై ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించింది" అని పేర్కొన్నారు. ప్రజా జీవితంలోకి అడుగుపెడుతున్న విజయ్‌కు శుభం కలగాలని లోకేశ్ ఆకాంక్షించారు. "ప్రజల అంచనాలను అందుకుంటూ, బాధ్యతతో, అంకితభావంతో విజయ్ పనిచేస్తారని ఆశిస్తున్నాను" అని లోకేశ్ తన సందేశంలో వివరించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు.

## అనకాపల్లి జిల్లాలో కట్టుదిట్టమైన వాహన తనిఖీలు



**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, మే :4**

అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపిఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా సోమవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. ప్రధాన రహదారులు, చెక్‌పోస్టుల వద్ద అనుమానాస్పద వాహనాలను ఆపి పత్రాలు పరిశీలించినట్లు నగర పోలీసు తెలిపారు. అక్రమ రవాణా, మద్యం సేవించి డ్రైవింగ్ వంటి నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## కలెక్టరేట్‌లో 'ఆయుష్' ఉచిత వైద్య శిబిరం ప్రారంభం





**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, మే :04**

జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)" సందర్భంగా 'ఆయుష్' ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఈ శిబిరం ప్రారంభమైంది. ఈ శిబిరం ద్వారా ప్రజలకు ప్రతి సోమవారం ఆయుర్వేదం, హోమియోపతి వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. వ్యాధి నిరోధక శక్తిని పెంచే మందుల పంపిణీతో పాటు, బీపీ పరీక్షలు నిర్వహించి, మోకాళ్ల నొప్పులు, ఆయాసం, దగ్గు, నీరసం, ఎసిడిటీ, మధుమేహం, యూరిన్ ఇన్ఫెక్షన్ వంటి అనారోగ్య సమస్యలకు చికిత్స అందిస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు పరవాడ ఆయుర్వేద మెడికల్ అధికారి డా. టి. శిరీష తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మరియు ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ఈ ఉచిత వైద్య శిబిరాన్ని కొనసాగిస్తామని ఆమె పేర్కొన్నారు. పి.జి.ఆర్.ఎస్‌కు దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చే ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో హరిపాలెం కాంపౌండర్ పి. మేరీ స్వర్ణలత, రేగుపాలెం ఎస్.ఎన్.ఓ. ఏ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షాన పల్లా – పింఛన్లతో లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం

**గాజువాక, సిటిజన్ టైమ్స్, మే :04**

గాజువాక శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో "పేదల సేవలో" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 34 మంది అర్హులకు కొత్త పింఛన్లు మంజూరు చేసి అందజేశారు. ఇందులో 22 మంది వికలాంగులకు పింఛన్లు ఇవ్వగా, మిగతా పింఛన్లు ఒంటరి మహిళలకు మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పింఛన్ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే, వారి సమస్యలను కూడా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం లక్ష్యమని అన్నారు. "సంక్షేమం సేవ సమానత్వం" అనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# నాగర్ కర్నూల్ జిల్లా బల్మూర్ లో కల్తీ కల్లు కలకలం

### చెంచు మహిళ మృతితో భగ్గుమన్న చెంచు కాలనీ!

### వరుస ఘటనలతో కథనాలు వస్తున్న నేపథ్యంలో ఎక్సైజ్ పోలీసుల చర్యలు శూన్యం.








**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ జిల్లా మే 4**

నాగర్‌కర్నూల్ జిల్లాలోని బల్మూర్ మండల కేంద్రంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కల్తీ కల్లు మహమ్మారి ఒక నిరుపేద చెంచు మహిళ ప్రాణాన్ని బలిగొంది. బల్మూర్ మండల కేంద్రంలోని చెంచు కాలనీకి చెందిన మంగమ్మ అనే మహిళ కల్తీ కల్లు తాగి మృతి చెందిందన్న వార్త స్థానికంగా కార్చిచ్చులా రాజేసింది. ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం, కల్లు దుకాణ నిర్వాహకుల అక్రమాలు వెరసి ఒక నిండు ప్రాణం గాలిలో కలిసిపోవడంతో బాధితులు రోడ్డెక్కారు. మృతదేహంతో నిరసన తో రణరంగంగా మారిన కల్లు దుకాణం అక్కడ మంగమ్మ మరణానికి కల్తీ కల్లే ప్రధాన కారణమని ఆరోపిస్తూ ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆగ్రహంతో ఊగిపోయారు. మృతదేహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి నేరుగా గ్రామంలోని కల్లు దుకాణం ముందుకు తరలించారు. అక్కడ బైఠాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడైన దుకాణ యజమాని విజయ్ గౌడ్ పై ఆగ్రహించిన బాధితులు ఆయనపై దాడికి యత్నించారు. ప్రాణభయంతో విజయ్ గౌడ్ అక్కడి నుండి తప్పించుకొని పోలీస్ స్టేషన్‌కు పరుగులు తీయాల్సి వచ్చింది. ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం.. అమాయకుల మరణాలు జరుగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో కల్తీ కల్లు కారణంగా ఇప్పటికే సుమారు 10 మంది మరణించారని, ఈ విషయాన్ని పలుమార్లు ఆబ్కారీ (ఎక్సైజ్) అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆయన ఆరోపించారు. ఎక్సైజ్ అధికారుల అండదండలతోనే నిర్వాహకులు ఇష్టారాజ్యంగా కల్తీ కల్లు విక్రయిస్తున్నారని, వారి నిర్లక్ష్యం వల్లే అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని దుయ్యబట్టారు. వెట్టిచాకిరి.. కల్లుకు బానిసలుగా మార్చి దగా! చేస్తున్నారని మృతురాలి బంధువులు కల్లు దుకాణ యజమానిపై సంచలన ఆరోపణలు చేశారు. అమాయక చెంచులను ఆసరాగా చేసుకొని, వారితో కల్లు సీసాలు, డ్రమ్ములు కడిగించుకుంటూ వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. చేసిన పనికి డబ్బులు ఇవ్వకుండా, అందుకు బదులుగా కల్తీ కల్లు ఇచ్చి వారిని బానిసలుగా మార్చారని మండిపడ్డారు. మంగమ్మ మృతికి పూర్తి బాధ్యత యజమానిదేనని, ఆమె కుటుంబానికి తగిన నష్టపరిహారం చెల్లించే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. పోలీసుల జోక్యం తో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఆందోళనకారులకు నచ్చజెప్పి, మృతదేహాన్ని వారి ఇంటికి పంపించారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రస్తుతానికి పరిస్థితి సద్దుమణిగింది. ప్రభుత్వం, ఎక్సైజ్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నాగర్‌కర్నూల్ జిల్లాలో విచ్చలవిడిగా సాగుతున్న కల్తీ కల్లు దందాను అరికట్టాలని, బాధ్యులైన అధికారులపై, దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# అంతర్వేది బీచ్‌లో జెట్‌స్కీ ఏ టీవీ సేవల ప్రారంభం...



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మే 4:**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది బీచ్‌లో జెట్‌స్కీ, ఏ టీవీ (ఆల్ ట్రైన్ వెహికల్) సేవల ప్రారంభోత్సవను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ, అంతర్వేది ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం రాష్ట్రంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన క్షేత్రమని, నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి విచ్చేస్తున్నారని, సముద్రం, గోదావరి నది కలిసే పవిత్ర సంగమ స్థలం కావడంతో అంతర్వేది ప్రత్యేక గుర్తింపు పొందిందని అన్నారు. ఇక్కడికి పెద్ద ఎత్తున పర్యాటకులు, భక్తులు వస్తున్నప్పటికీ తగిన వసతులు, సౌకర్యాలు ఇంకా పూర్తిస్థాయిలో లేవని, అందువల్ల టూరిజం అభివృద్ధి కోసం రిసార్ట్‌లు, హోటళ్లు, కళ్యాణ మండపాల నిర్మాణం చేపట్టాలనే ఆలోచిస్తున్నామని తెలిపారు. ఆలయ అభివృద్ధితో పాటు పర్యాటక రంగాన్ని సమాంతరంగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. అంతర్వేది బీచ్ వద్ద ప్రారంభించిన జెట్‌స్కీ, ఏ టీవీ సేవలు పర్యాటకులకు కొత్త అనుభూతిని అందిస్తాయని, ఇవి పర్యాటక రంగానికి మరింత ఊతమిస్తాయని ఎమ్మెల్యే దేవ తెలిపారు. ఈ సేవలు అంతర్వేది పల్లవపాలెం గ్రామానికి చెందిన పొన్నాల విజయ్ బ్రదర్స్, టీమ్ సారథ్యంలో అంతర్వేది బోట్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో అందుబాటులో ఉంటాయని, భవిష్యత్తులో అంతర్వేది ప్రాంతంలో మరిన్ని ప్రజా ఆహ్లాదకరమైన పర్యాటక సౌకర్యాలను అభివృద్ధి చేసి, ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలో ప్రముఖ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే దేవ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, పర్యాటకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## భారీ వర్షానికి చెట్టు కూలి ఇద్దరు మహిళలు మృతి



**పెదబయలు, సిటిజన్ టైమ్స్, మే :04**

పెదబయలు మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన వారపు సంతలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మధ్యాహ్నం సమయంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో సంతలో షెడ్డు వేసుకుని వ్యాపారం చేస్తున్న ఇద్దరు మహిళలపై భారీ చెట్టు కూలింది. ఈ ఘటనలో వారు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనతో సంత ప్రాంతంలో కలకలం రేగింది. మృతుల బంధువులు, స్థానికులు తీవ్ర విషాదంలో మునిగిపోయి రోదనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న అధికారులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తున్నారు. మృతి చెందిన మహిళల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## విభిన్న ప్రతిభావంతులకు రూ.6.15 లక్షల

### విలువైన ల్యాప్ టాప్, మొబైల్ ఫోన్లు అందించిన కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.



కాకినాడ( సిటిజన్ టైమ్స్)మే 4:

కాకినాడ కలెక్టరేట్ లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులకు రూ.6.15 లక్షల విలువైన ల్యాప్ టాప్ లు, మొబైల్ ఫోన్లను జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్.. విభిన్న ప్రతిభావంతులు వయావృద్ధుల సంక్షేమ శాఖ ఏడి ఏవై.శ్రీనివాసుతో కలిసి ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లా విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ, ఆపైన చదువుతున్న దివ్యాంగులకు, రూ.45 వేల విలువైన ల్యాప్ టాప్, పదో తరగతి ఆ పైన చదువుతున్న బధిరులకు రూ.15 వేల విలువైన మొబైల్ ఫోన్లు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 11 మందికి ల్యాప్ టాపులు, 08కి మొబైల్ ఫోన్లు పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం, అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.6.15 లక్షల విలువైన ల్యాప్ టాపులు, మొబైల్ ఫోన్లు ఉచితంగా విద్యార్థులకు అందించిందన్నారు. దివ్యాంగ విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పేనాయక్, విభిన్న ప్రతిభావంతులు వయావృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ ఉంద్రాజుపు రాజు, వివిధ శాఖల అధికారులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులు "థర్డ్ డిగ్రీ" ఉపయోగించవచ్చా...?




నేషనల్ పోలీస్ అకాడమీ (సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ) మరియు స్టేట్ పోలీస్ అకాడమీలలో 'థర్డ్ డిగ్రీ' ఉపయోగించరు. బలవంతంగా సమాచారం రాబట్టడానికి ఉపయోగించే క్రూరమైన పద్ధతి, దీనిని "థర్డ్ డిగ్రీ" అంటారు. భారతదేశంలో, ఇది ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు కు విరుద్ధం. ఈ శిక్షణ కేంద్రాలు పోలీసు సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి మరియు వారిని ఉత్తమ పనితీరు గల పోలీసు సిబ్బందిగా తీర్చిదిద్దడానికి స్థాపించబడ్డాయి. థర్డ్ డిగ్రీ అంటే శిక్షించే విధానం, ఇతరులను బలవంతంగా ప్రశ్నించడం మరియు వారి నుండి సమాచారం సేకరించడం. ఇది చట్టవిరుద్ధం మరియు మానవ హక్కులకు వ్యతిరేకం. సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ మరియు స్టేట్ పోలీస్ అకాడమీలలో, పోలీసు సిబ్బందికి చట్టబద్ధమైన విచారణ పద్ధతులను శిక్షణ ఇస్తారు. వారు నిజమైన సమాచారం సేకరించడానికి మరియు నేరాలను పరిష్కరించడానికి ఇతర పద్ధతులను కూడా నేర్చుకుంటారు. కాబట్టి, నేషనల్ పోలీస్ అకాడమీ మరియు స్టేట్ పోలీస్ అకాడమీలలో థర్డ్ డిగ్రీని ఉపయోగించరు. శిక్షణ సిబ్బంది చట్టపరమైన మరియు నైతికమైన పద్ధతులను మాత్రమే ఉపయోగిస్తారు.

**పోలీసులు కొడితే వారిపై ఏ సెక్షన్ కింద కేసు పెట్టవచ్చు?**

అరెస్ట్ చేసిన తర్వాత లేదా అరెస్ట్ చేయక ముందు గాని ఏ సందర్భంలో గాని పోలీసులు ప్రజలను కొట్టే అధికారం లేదు. ఒక వేళ మిమ్మల్ని కొడితే పోలీసు యాక్ట్ 1861 సెక్షన్ 29 ప్రకారం ఆ పోలీసు అధికారికి 3 నెలల జైలు శిక్ష లేదా జరిమానాతో కూడిన శిక్ష వేయవచ్చని చట్టంలో ఉన్న నిబంధనలు చెబుతున్నాయి.

**కేసులో ఉదాహరణ: క్రైమ్ నెం 118/78, :-11/07/1983**

కంప్లైంట్ తేదీ12/04/1982 న ఆర్.ఆర్ యాదవ్ అనే వ్యక్తి పైన కేసు నమోదు అయినందున సదరు వ్యక్తి పోలీస్ స్టేషన్ కేస్ రికార్డు చూపించమని అడగగా దౌలాద్ సింగ్ అనే (సూపర్టెంట్ ఆఫ్ పోలీస్)కి ఆర్.ఆర్ యాదవ్ పైన చేయి చేసుకోవడం తో పాటుగా దుర్భాసలాడడం వలన ఆర్.ఆర్ యాదవ్ అనే వ్యక్తి పోలీస్ యాక్ట్ ను అనుసరించి ప్రైవేట్ కంప్లైంట్ వేసి దౌలాద్ సింగ్ (సూపర్టెంట్ ఆఫ్ పోలీస్) పై కేసు నమోదు చేయించడం జరిగింది. విధులను ఉల్లంఘించినందుకు గాను పోలీస్ యాక్ట్ సెక్షన్ 29 ప్రకారం నేరం రుజువైనట్లు నమోదు చేసిన తర్వాత, చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ జలోర్ కూడా ప్రశ్నపై పూర్తి విచారణ జరిపారు. కేసు యొక్క అన్ని సంబంధిత వాస్తవాలు, పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, లెర్న్ చీఫ్ జడ్జి, మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఒక నెల జీతం అంటే జూలై, (1983 సంవత్సరం) నెలకు జరిమానాగా చెల్లించాలని జరిమానా చెల్లించని పక్షంలో 10 రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇవ్వడం జరిగింది. అయితే కొన్ని సందర్భాలలో పోలీస్ యాక్ట్ ఉల్లంఘించడం వలన సెక్షన్ 29 ప్రకారం సదరూ పోలీస్ అధికారికి ఒకటి లేదా మూడు నెలలు జైలు విధించడం జరుగుతుంది. విధుల నుంచి తొలగించడం లేదా జరిమానా మరియు జైలు శిక్ష కూడా కొన్ని సందర్భంలో కోర్టు విధించడం జరుగుతుంది.

జె. కనక దుర్గ లక్ష్మీ
ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (IHR)
ఉత్తరాంధ్ర ఇంచార్జి.

# జీవీఎంసీపై విమర్శలు

## - మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు వేయాలని నిరసన







**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :04**

పశ్చిమ నియోజకవర్గంలోని 91, 92 వార్డుల్లో మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగుల రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ రహిమాన్ పాల్గొని మాట్లాడుతూ, మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగుల రహదారి నిర్మించాల్సి ఉన్నప్పటికీ, జివిఎంసీ అధికారులు వంటిల్లు నుంచి సుసర్ల కాలనీ వరకు 60 అడుగుల రోడ్డు మాత్రమే వేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా సుసర్ల కాలనీ నుంచి లక్ష్మీనగర్, ఇందిరానగర్, కుమార్ కళ్యాణ మండపం వరకు 40 అడుగుల రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని విమర్శించారు. మధ్యలో హెచ్‌డీ లైన్ ఏర్పాటు చేయడం వల్ల సమస్యలు మరింత పెరిగే అవకాశముందని అన్నారు. ఈ విధమైన అసమాన రహదారి నిర్మాణం వల్ల కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనాలు పైభాగానికి వెళ్లలేక, ప్రజలు తమ వాహనాలను రోడ్డుపైనే ఉంచి ఇళ్లకు వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో, మరణించిన వారి మృతదేహాలను కూడా రోడ్డుపైనే ఉంచాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ సమస్యపై జివిఎంసీ కమిషనర్ మరియు స్థానిక ఎమ్మెల్యే గణబాబు దృష్టికి ప్రజలు తీసుకెళ్లినప్పటికీ, సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. కొందరికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ, మిగతా ప్రజలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ స్పందించి సంబంధిత జివిఎంసీ అధికారులకు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. వంటిల్లు నుంచి సుసర్ల కాలనీ వరకు నిర్మిస్తున్న 60 అడుగుల రోడ్డు తరహాలోనే, లక్ష్మీనగర్,ఇందిరానగర్, కుమార్ కళ్యాణ మండపం వరకు కూడా సమానంగా రహదారి నిర్మించాలని ఆదేశించినట్లు వెల్లడించారు. అభివృద్ధి కోసం అవసరమైతే తమ ఇళ్లను కోల్పోయేందుకు కూడా సిద్ధమని స్థానిక ప్రజలు చెప్పినప్పటికీ, వారి అభిప్రాయాలను పట్టించుకోకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగుల రహదారి నిర్మాణాన్ని తక్షణమే అమలు చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. లేదంటే ప్రజా ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించింది. ప్రజాప్రతినిధులు అందరికీ సమాన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి పి. చంద్రశేఖర్, కసిరెడ్డి సత్యనారాయణ, ఎం. మన్మధరావు, ఎంఏ. బేగం, ఆర్. శ్రీనివాసరావు, ఎన్. నాగభూషణ్, ఎం. రాజశేఖర్, కె. సూర్యకుమారి, ఓ. అనంత్, జె. రాజీవ్, నిర్మల, టి. సాయి బాబా తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు తక్షణ జోక్యం అవసరం

### తెలుగు శక్తి బి.వి. రామ్



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :04**

తమిళనాడులో వెలువడిన ఎన్నికల ఫలితాలు ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వానికి గుణపాఠంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి. రామ్ అన్నారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సినీ నటుడు విజయ్ స్థాపించిన పార్టీ తక్కువ కాలంలోనే విశేష ప్రజాదరణ పొందడం గమనార్హమన్నారు. అన్న నందమూరి తారక రామారావు చూపిన ప్రజా పరిపాలనకు ఇది ప్రతిబింబమని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత పరిపాలన సక్రమంగా లేదని, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన విమర్శించారు. ఈ పరిస్థితులకు మంత్రి నారా లోకేష్ అనుసరిస్తున్న కార్పొరేట్ తరహా పాలనే కారణమని ఆరోపించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన సాగకపోతే పార్టీ భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే పరిస్థితిపై దృష్టి సారించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని రామ్ సూచించారు. లేకపోతే తమిళనాడులో డీఎంకే పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయినట్లే, తెలుగుదేశం పార్టీకి కూడా ఇలాంటి పరిస్థితి ఎదురయ్యే అవకాశముందని పేర్కొన్నారు. ప్రజలను ఓటర్లుగా కాకుండా దేవుళ్ళుగా భావించి సేవ చేస్తేనే నిజమైన సుపరిపాలన సాధ్యమవుతుందని అన్నారు. ఇక నారా లోకేష్ వైఖరి కారణంగా భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీలకు కూడా రాజకీయ నష్టం కలగవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తమిళనాడులో తాజా రాజకీయ పరిణామాల్లో విజయ్ పార్టీ అతిపెద్ద శక్తిగా ఎదగగా, ఏఐడీఎంకే రెండో స్థానంలో నిలిచిందని, డీఎంకే మూడో స్థానానికి పరిమితమై ప్రతిపక్ష హోదాను కూడా కోల్పోయిందని తెలిపారు. 2024 ఫిబ్రవరి 2న పార్టీని స్థాపించిన విజయ్ తక్కువ కాలంలోనే దేశవ్యాప్తంగా గుర్తింపు సాధించారని ప్రశంసించారు. ఈ సందర్భంగా విజయ్ పార్టీకి, తమిళనాడు ప్రజలకు తెలుగు శక్తి తరఫున అభినందనలు తెలిపారు.

## ఎన్టీఆర్ వీరాభిమాని మృతి... ఆర్థిక సాయం అందజేసిన వాసుపల్లి



**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, మే :04**

ఎన్టీఆర్ వీరాభిమాని, మత్స్యకార నాయకుడు బర్రి కోదండ ఆకస్మిక మృతి విశాఖలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆయన మరణంపై వైసిపి విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ గాఢ సంతాపం వ్యక్తం చేశారు. కోదండ కుటుంబాన్ని స్వయంగా పరామర్శించిన వాసుపల్లి గణేష్ కుమార్, దహన సంస్కారాల కోసం రూ.10,000 ఆర్థిక సహాయం అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తాను ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలవడంలో కోదండ కీలక పాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. బర్రి కోదండ గురించి ఆయన భావోద్వేగంగా మాట్లాడుతూ "అతను అందరితో కలిసిపోయే మనసున్న వ్యక్తి... నమ్మిన వారికోసం చివరి వరకు నిలబడే నిజాయితీ గల నాయకుడు... ఇలాంటి మంచి మనసున్న వ్యక్తిని కోల్పోవడం ఎంతో బాధాకరం" అని అన్నారు. అతన్ని ఒక కుటుంబ సభ్యుడిలా భావించేవాడినని, స్వార్థం లేకుండా తనవాళ్ల కోసం ఎంతవరకైనా వెళ్లే వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఎప్పుడూ ముందుండి సహాయం చేసే గొప్ప మనిషి కోదండ అని కొనియాడారు. "మనల్ని నమ్మి, మన కోసం కష్టపడిన వారిని ఎప్పుడూ మరవకూడదు" అని ఈ సందర్భంగా వాసుపల్లి స్పష్టం చేశారు. బర్రి కోదండ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ గానగాళ్ల రామరాజు, చింతకాయల వాసు, చేపల రాజు తదితర మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లపై కఠిన నిఘా

### -పోలీసులు హెచ్చరిక

**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్, మే :04**

జిల్లాలో రౌడీషీటర్లు, నేర చరిత్ర గల వ్యక్తులపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్నదని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, తెలిపారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని, కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షించడం లక్ష్యంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు విస్తృతంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర ప్రవర్తనను వెంటనే విడనాడి సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. మళ్లీ నేరాలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలతో పాటు అదనపు కేసులు నమోదు చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా వారి కదలికలపై నిరంతరం నిఘా కొనసాగుతోందని, ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాలను కట్టడి చేస్తామని తెలిపారు.



## ప్రజా వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు : కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్






**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :04**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) ద్వారా అందుతున్న వినతులను గడువు దాటకముందే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ఆయన పలు ముఖ్య సూచనలు చేశారు. పీజీఆర్‌ఎస్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సేవలకు సంబంధించిన వినతుల పరిష్కారానికి సమర్థవంతమైన ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిర్యాదులు మళ్లీ రీ-ఓపెన్ కాకుండా చూడాలని స్పష్టం చేశారు. ఒకవేళ అలాంటి పరిస్థితి తలెత్తితే సంబంధిత అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను సమగ్రంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి బదిలీ అయ్యే ఫిర్యాదులపై జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించాలని, వాటి పరిష్కారంపై కచ్చితమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో ప్రజల నుంచి అందే వినతుల నమోదు కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించి, వాటిని ప్రత్యేక కార్యాచరణతో త్వరితగతిన పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరితో కలిసి కలెక్టర్ స్వయంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పీజీఆర్‌ఎస్ మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాల్లో మొత్తం 354 వినతులు నమోదయ్యాయి. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 56, జివిఎంసీకి చెందినవి 109, పోలీస్ శాఖకు సంబంధించినవి 31, ఇతర శాఖలకు చెందినవి 158 వినతులు ఉన్నాయి. పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, ఏడీసీ సత్యవేణి పాల్గొని వినతులు స్వీకరించగా, రెవెన్యూ క్లినిక్‌లో ఆర్డీవోలు, తహశీల్దార్లు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యారు.

## పాత భవనం కూలి యువకుడు మృతి చెందడం బాధాకరం..

### నాగేశ్వరరావు కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది..

### రాష్ట్ర టిడిపి అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు



**గాజువాక, సిటిజన్ టైమ్స్, మే 04:**

గాజువాక వికాస్ నగర్ లో పాత భవనం కూలి ఒకరు మృతి చెందడం బాధాకరమని రాష్ట్ర టిడిపి అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈరోజు సంఘటన స్థలాన్ని ఆయన పరిశీలించి ఉపాధి కోసం వచ్చిన 34 ఏళ్ల యువకుడు నాగేశ్వరరావు మృతి చెందడం బాధాకరమని, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘటన జరిగిన వెంటనే స్థానిక నాయకులు, పోలీస్ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకొని అత్యవసర చర్యలు చేపట్టారని అన్నారు.పాత భవనాలు నిర్మాణాలు చేపట్టినప్పుడు అనేక నిబంధనలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా ఉండడంతో ఈ ఘటన చోటు చేసుకుందని అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం నుంచి అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాజీ డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్ స్థానిక నాయకులు సహకారంతో కుటుంబానికి నగదును అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజువాక టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు, వార్డు మాజీ కార్పొరేటర్ నరసింహ పాత్రుడు,టిడిపి నాయకులు బైపల్లి గాంధీ, గోమాడ వాసు, దేవుడు, స్వరూపారాణి, రెట్టి వాసు,జనసేన నాయకులు రేయి రత్నం, వామపక్ష నేతలు తదితరులు పాల్గొన్నారు.



## సింహాచలంలో మంత్రి అచ్చెన్నాయుడు దంపతుల ప్రత్యేక పూజలు





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్,మే :04**

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దంపతులతో కలిసి సోమవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో వేదాశీర్వచనం స్వీకరించారు. ముందుగా ఆలయ అధికారులు మంత్రిదంపతులను పూర్ణకుంభంతో శాస్త్రోక్తంగా స్వాగతించి గర్భాలయానికి తీసుకెళ్లారు. స్వామివారి దర్శనం అనంతరం కప్పస్తంభం వద్ద సంప్రదాయం ప్రకారం మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రిదంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. దాదాపు పాతికేళ్ల దాంపత్య జీవితం పరస్పర సహకారంతో ఆదర్శప్రాయంగా సాగుతోందని కొనియాడుతూ వారికి ఆత్మీయ సత్కారం అందించారు. వైశాఖ మాసంలో స్వామివారి దర్శనం ఎంతో ఆనందాన్ని కలిగించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. తమకు శుభాకాంక్షలు తెలిపిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆలయాల అభివృద్ధి, టెంపుల్ టూరిజానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఇటీవలి చందనోత్సవం విజయవంతంగా నిర్వహించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయి పర్యటనలో అధికారులకు కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలు





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :04**

నగరంలో త్రాగునీటి సరఫరాపై పెరుగుతున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని లోపాలను తక్షణమే సరిదిద్ది, ప్రజలకు ప్రతిరోజూ నిర్ణీత సమయంలో సమృద్ధిగా నీరు అందేలా చర్యలు చేపట్టాలని జివీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. సోమవారం తూర్పు జోన్ 23వ వార్డు పరిధిలోని కె.ఆర్.ఎమ్. కాలనీ ప్రాంతంలో పర్యటించిన ఆయన, త్రిబుల్ ఆర్ సెంటర్, ఏఎంజీ హాస్పిటల్, సీతమ్మధార రైతు బజార్, బాలయేసు చర్చ్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా త్రాగునీటి సరఫరా అంతరాయాలు లేకుండా వార్డు సచివాలయ సిబ్బంది, ఇంజనీర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. త్రిబుల్ ఆర్ సెంటర్‌లో వ్యర్థాల విభజన, కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించిన కమిషనర్, నిర్వహణలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే కాలువలు మూసుకుపోవడం, మురుగునీటి ప్రవాహంలో అంతరాయాలను గమనించి శుభ్రపరిచే పనులు వేగవంతం చేయాలని చెప్పారు. రోడ్లపై వ్యర్థాలు వేయడం, నిర్మాణ సామగ్రి ఉంచడం, ఆక్రమణలు వంటి అంశాలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. నగర పారిశుధ్యాన్ని మెరుగుపరచేందుకు సిబ్బందికి అవగాహన కల్పించాలని కూడా ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

## పాడేరు శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహణకు సిద్ధం



**అరకు, సిటిజన్ టైమ్స్, మే 04:**

అల్లూరిసీతారామరాజు జిల్లా, పాడేరు లో వెలసిన శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 17, 18, 19 తేదీలలో జరగనున్న రాష్ట్ర పండుగకు సంబంధించిన పోస్టర్‌ను ఈరోజు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు ఈ జాతర ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ,రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ మాజీ సభ్యులు సివేరి అబ్రహం , అరకు నియోజకవర్గ ఇంచార్జి సియ్యారి దొన్ను దొర,మాజీ మంత్రి మత్స్యరాస మణీకుమారి,రాష్ట్ర కార్యదర్శులు ఎం.వి.వి ప్రశాద్,కొట్టగుళ్ళి సుబ్బారావు,జిసిసి డైరెక్టర్ బొర్ర నాగరాజు,టురిజం డైరెక్టర్ కిల్లు రమేష్ నాయుడు ,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు భక్తులు పాల్గోన్నారు.

## పిడుగు పడి బాలిక మృతి

**అల్లూరి జిల్లా, సిటిజన్ టైమ్స్, మే :04**


అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలంలో సోమవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. కాంద్రం పంచాయతీ పరిధిలోని సిందరిగుడ గ్రామానికి చెందిన సోంగుల దివ్య అనే బాలిక గ్రామ శివారు కొండ ప్రాంతానికి వెళ్లిన సమయంలో అకస్మాత్తుగా పిడుగు పడింది. తీవ్రంగా గాయపడిన దివ్యను కుటుంబ సభ్యులు వెంటనే డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు తరలించగా, అక్కడికి చేరుకునే సరికి ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఆకస్మిక ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. స్థానికులు దివ్య మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారులు ప్రజలు వర్షాకాలంలో మెరుపులు, పిడుగులు సంభవించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



# అధికారులపై కలెక్టర్ సీరియస్...

# పనుల్లో ఆలస్యం చేస్తే చర్యలు తప్పవు






**అనకాపల్లి , సిటిజన్ టైమ్స్, మే :04**

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎంపీడీవోలు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు. ప్రతి శాఖ సమన్వయంతో పని చేసి లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని ఆమె పునరుద్ఘాటించారు. జిల్లాలో అమలవుతున్న వాట్సాప్ గవర్నెన్స్ ట్రైనింగ్, సిటిజన్ ఈ-కేవైసీ, యునైటెడ్ ఫ్యామిలీ సర్వే వంటి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించిన కలెక్టర్, ఆశించిన స్థాయిలో పనులు జరగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా మూడో స్థానంలో ఉన్నప్పటికీ కేవలం 20 శాతం పురోగతి మాత్రమే నమోదవడం సంతృప్తికరంగా లేదన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభంగా అందించేందుకు ప్రవేశపెట్టిన 'మనమిత్ర' యాప్ వినియోగాన్ని గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ యాప్ ద్వారా సుమారు 161 పౌర సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.యూఎఫ్ఎస్ మిస్సింగ్ డేటా, పెండింగ్ పనులపై ఎంపీడీవోలు వ్యక్తిగత బాధ్యత తీసుకుని వెంటనే పూర్తి చేయాలని, ఏ ఒక్క మండలం కూడా లక్ష్యాల కంటే వెనుకబడకూడదని కఠినంగా హెచ్చరించారు. జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జలధార-జలహారతి' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జలవనరుల శాఖతో పాటు అనుబంధ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉపాధి హామీ పనుల్లో గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన లక్ష్యంగా అధికారులు మరింత చురుకుదనం ప్రదర్శించాలని చెప్పారు. నిర్ణీత ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు పనులను వెంటనే ప్రారంభించాలని, వచ్చే వారం లోపు వెండర్లతో సమావేశం ఏర్పాటు చేసి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. లక్ష్యాలకు తగ్గట్టు పనులు చేయలేని వెండర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని హెచ్చరించారు. వచ్చే 45 రోజులు తీవ్ర ఎండలు ఉండే అవకాశం ఉన్నందున ఉపాధి హామీ పనుల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పనులు ఉదయం 6 గంటలకు ప్రారంభించి 10 గంటలకల్లా ముగించాలని, ప్రతి పనిస్థలం వద్ద తాగునీరు, నీడ, మెడికల్ కిట్ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వడదెబ్బ మరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సంభవించకూడదని స్పష్టం చేశారు. గ్రామాల్లో చలివేంద్రాల ఏర్పాటు తప్పనిసరి అని పేర్కొన్నారు. జల జీవన్ మిషన్, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ వంటి కీలక అంశాల్లో పనితీరు సంతృప్తికరంగా లేకపోవడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పనులు జరుగుతున్నప్పటికీ ఎంపీడీవోలు సైట్‌లను సందర్శించి ఫోటోలు అప్‌లోడ్ చేయకపోవడం గమనార్హమన్నారు. బుచ్చయ్యపేట మండలం మినహా మిగతా ప్రాంతాల్లో పర్యవేక్షణ లోపిస్తున్నదని ప్రశ్నించారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో జిల్లా 18వ స్థానానికి పడిపోవడం ఆందోళనకరమని, గతంలో రెండో స్థానంలో ఉన్న జిల్లా వెనుకబడటం మంచిది కాదన్నారు. నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో పనులు మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయికి వెళ్లి డేటాను వెంటనే అప్‌లోడ్ చేయాలని సూచించారు. వచ్చే వారం జరిగే సమీక్షా సమావేశానికి ముందే పనుల్లో స్పష్టమైన పురోగతి కనిపించకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల అధికారులు, జడ్పీ సీఈవో, ఎంపీడీవోలు మరియు ఇతర జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ ప్రజా సమస్యల వేదికలో 131 వినతులు నమోదు







**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :04**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలో మొత్తం 131 వినతులు స్వీకరించబడ్డాయి. ఈ విషయాన్ని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ వెల్లడించారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డి.వి. రమణమూర్తి, ఎస్.ఎస్. వర్మలతో కలిసి కమిషనర్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సమీక్షించారు. జోన్ల వారీగా వచ్చిన వినతుల్లో ఈస్ట్ జోన్‌లో అత్యధికంగా 22 ఫిర్యాదులు నమోదు కాగా, నార్త్ జోన్‌లో 19, పెందుర్తి జోన్‌లో 15, మధురవాడ మరియు గాజువాక జోన్లలో తలా 13 చొప్పున ఫిర్యాదులు అందాయి. సౌత్ జోన్‌కు 11, వెస్ట్ జోన్‌కు 4, భీమిలి మరియు అగనంపూడి జోన్లకు తలా 2 ఫిర్యాదులు వచ్చాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 30 వినతులు చేరాయి. విభాగాల వారీగా పరిశీలిస్తే పట్టణ ప్రణాళిక విభాగానికి అత్యధికంగా 65 ఫిర్యాదులు అందగా, ఇంజినీరింగ్ విభాగానికి 24, రెవెన్యూ విభాగానికి 15, అడ్మినిస్ట్రేషన్ ఓ అకౌంట్స్‌కు 10, జోనల్ అడ్మినిస్ట్రేషన్‌కు 7, ప్రజారోగ్య విభాగానికి 5, యూసీడీ విభాగానికి 3, మొక్కల విభాగానికి 2 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ సందర్భంగా కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని అధికారులు అదే రోజు పరిశీలించి, సంబంధిత ఫిర్యాదుదారులతో సంప్రదించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ప్రతి వారం అదే సమస్యలపై మళ్లీ ఫిర్యాదులు రాకుండా అధికారులు సమగ్ర చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ (అమృత్) డి. విజయభారతి, ప్రధాన ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజు, సీసీపీ ఎ. ప్రభాకరరావు, సిఎంఓహెచ్ డా. ఇన్.వి. నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి. వాసుదేవరెడ్డి, డీసీఆర్ ఎస్. శ్రీనివాసరావు, ఏడిహెచ్ వాసుకి, స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఏ. రాజు, డీఎఫ్‌వో ఐ. ధర్మారావు, యూసీడీ పీఓ పి. ప్రసన్న వాణి, డీపీవోలు శాంతికుమారి, నాగార్జున, బయాలజిస్ట్ సాంబమూర్తి, సిటీ వెటర్నరీ అధికారి డా. రవికుమార్, ఏఓ పద్మజ, ఎస్టేట్ అధికారి పి.ఎస్. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## యువ చెస్ ప్రతిభకు వేదిక

**- మే 9 నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు**






**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :04**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అండర్ 11 ఓపెన్, గర్ల్స్ చెస్ చాంపియన్‌షిప్--2026కు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం విశాఖపట్నంలో ఘనంగా ఆవిష్కరించారు. ఓపెన్ ఇన్విటేషనల్ క్లాసికల్ చెస్ టోర్నమెంట్ వేదికపై నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఛైర్మన్ కె.వి.వి. శర్మ, అధ్యక్షులు ఎ. సురేష్, సీఈఓ బి. నీలిమ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో మణి చెస్ అకాడమీ డైరెక్టర్ కమలేశ్వరరావు, టోర్నమెంట్ డైరెక్టర్ మణికంఠ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌షిప్ మే 9, 10 తేదీలలో విశాఖపట్నంలోని విశాలాక్షి నగర్‌లోని బీవీకే కళాశాలలో నిర్వహించబడనుంది. 01-01-2015 లేదా ఆ తర్వాత జన్మించిన బాలబాలికలు ఈ పోటీలలో పాల్గొనడానికి అర్హులు. ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ మరియు ఆంధ్ర చెస్ అసోసియేషన్ సహకారంతో మణి చెస్ అకాడమీ ఈ పోటీలను నిర్వహిస్తోంది. ఈ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన టాప్-2 క్రీడాకారులు క్రీడాకారిణులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ ఆగస్టు 2 నుండి 8 వరకు మంగళూరులో జరిగే అండర్ 11 నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ 2026లో పాల్గొనే అవకాశం పొందుతారు. ఆసక్తి గల క్రీడాకారులు మే 7 సాయంత్రం లోపు నిర్ణయించిన రుసుమును చెల్లించి, టోర్నమెంట్ డైరెక్టర్ మణికంఠ రావు ద్వారా నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలు యువ క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునే మంచి వేదికగా నిలుస్తాయని ఏవీసీఏ అధ్యక్షుడు డా. రంగాల బాబురావు పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ గ్రోత్ ఇంజన్ విశాఖపట్నం

**రాష్ట్రంలో పెట్టుబడులకు ఇదే మంచి తరుణం**

**పరిశ్రమల ఏర్పాటుచేసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం వహించండి**

**ప్రవాసాంధ్రులకు విశాఖ ఎంపీ శ్రీభరత్ పిలుపు**






**విశాఖపట్నం, మే 04(సిటిజన్ టైమ్స్ ):**

శరవేగంగా అభివృద్ధి సాధిస్తున్న విశాఖ రీజియన్ లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా విశాఖ ఎంపీ ముతుకుమిల్లి శ్రీభరత్ ప్రవాసాంధ్రులకు పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనకు వెళ్లిన శ్రీభరత్ కాలిఫోర్నియాలోని మిల్పిటాస్ లో ఉత్తర అమెరికా ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం ఆధ్వర్యాన నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ కు గ్రోత్ ఇంజన్ విశాఖపట్నం, సీఎం చంద్రబాబు సారథ్యంలో ట్రిలియన్ డాలర్ ఎకానమీ దిశగా వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలతో పాటు ప్రస్తుతం ఏపీలో పరిశ్రమదారులకు దేశంలోనే అత్యుత్తమ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. మంత్రి లోకేష్ చొరవతో టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రధాన సంస్థలు తమ కార్యకలాపాలు ప్రారంభించాయి, గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ వంటి ప్రధాన సంస్థలు ఇప్పటికే పనులు ప్రారంభించాయి, జులై మొదటివారంలో భోగాపురం ఎయిర్పోర్టు ప్రారంభం కాబోతోంది, ప్రవాసాంధ్ర పెట్టుబడిదారులకు ఇదే మంచి తరుణమని అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడుల్లో 25శాతానికి పైగా ఏపీకి వస్తున్నాయని చెప్పారు. పరిశ్రమలకు అన్నివిధాలా అనుకూలతలు కలిగిన విశాఖలో పెట్టుబడులు పెట్టి, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం వహించాల్సిందిగా ఎంపీ శ్రీభరత్ విజ్ఞప్తి చేశారు. ప్రవాసాంధ్రులకు అన్నివిధాల సహాయ, సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఏ ఎన్ఆర్ఐ టిడిపి నాయకులు వెంకట్ కోగంటి, శ్రీకాంత్ దొడ్డపనేని, భక్త భల్లా, సుధీర్ ఉన్నం, హరి సన్నిధి, విజయ్ ఆసూరి, శశి దొప్పలపూడి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతతో నీటి సంక్షోభం

## - తక్షణ చర్యలు తీసుకోవాలి: సిపిఎం డిమాండ్





**రావికమతం, సిటిజన్ టైమ్స్, మే:04**

రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ పరిధిలోని జెడ్ జోగంపేట గ్రామంలో ఆదివాసీ గిరిజనులు తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎస్టీ కొండదొర తెగకు చెందిన సుమారు 64 కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామంలో నీటి ట్యాంక్ ఉన్నప్పటికీ, గత రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నీటి పంపింగ్ పూర్తిగా ఆగిపోయింది. దీంతో గ్రామస్తులు తాగునీటి కోసం కల్యాణలోవ రిజర్వాయర్, పెద్దగెడ్డ వంటి దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో ఉన్న రెండు బోర్‌వెల్లు కూడా పనిచేయకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేసింది. రోజువారీ పనులను మానుకుని నీటి కోసం గెడ్డల వద్దకు వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చినా పరిస్థితి మారడం లేదని, కరెంట్ లేకపోతే నీటి సమస్య మళ్లీ మళ్లీ తలెత్తుతుందని వారు తెలిపారు. ఈ సమస్యపై ఆదివారం గ్రామస్తులు వినూత్నంగా ఆందోళన చేపట్టి అధికారుల దృష్టిని ఆకర్షించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ కష్టాలను వివరించారు. తక్షణమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి, ప్రత్యామ్నాయంగా బోర్‌వెల్లు ఏర్పాటు చేసి శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు పాంగి చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు కే. గోవిందరావు ఈ సమస్యపై స్పందిస్తూ, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక అవసరమైన తాగునీరు అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమని, సంబంధిత శాఖలు తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని వారు పేర్కొన్నారు.

## నిజాయితీకి నిలువుటద్దం అప్పల నరసింహరాజు

**మాజీ మంత్రి చిత్రపటానికి నివాళులర్పించిన గుడివాడ అమర్నాద్...**

**కుటుంబ సభ్యులకు పరామర్శ, ధైర్యం చెప్పారు...**

**భీమిలి రాజకీయాల్లో ఆయనో అజాత శత్రువు...**



**పద్మనాభం,సిటిజన్ టైమ్స్,మే 04:**

మచ్చలేని రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి ఆర్.ఎస్.డి.పి. అప్పల నరసింహరాజు మృతి భీమిలి నియోజకవర్గానికి తీరని లోటని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. సోమవారం మండలంలోని పాండ్రంగి గ్రామంలో ఉన్న రాజు స్వగృహాన్ని ఆయన సందర్శించారు. అప్పల నరసింహరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ, అప్పల నరసింహరాజు రాజకీయ ప్రస్థానం భావితరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. నాలుగు పర్యాయాలు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా పనిచేసినా సామాన్యుడిగానే జీవించిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేసుకున్నారు. పాండ్రంగి మట్టిబిడ్డగా, భీమిలి గడ్డపై చెరగని ముద్ర వేశారని భావోద్వేగానికి అమర్ లోనయ్యారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## దీర్ఘకాలిక లీజుకు జీవీఎంసీ భవనాలు

**- తూర్పు జోన్ జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్**

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :04**

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో తూర్పు జోన్‌కు చెందిన 13వ వార్డు, ముడసరలోవలో బి.ఆర్.టి.ఎస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న విశాల ప్రాంగణంలో నిర్మితమైన మూడు భవనాలను దీర్ఘకాలిక లీజుకు ఇవ్వడానికి చర్యలు చేపట్టినట్లు తూర్పు జోన్ జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్ తెలిపారు. సుమారు 74,000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఈ భవనాలు అన్ని మౌలిక సదుపాయాలతో సిద్ధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. భోజనశాల, హాస్టల్ సదుపాయాలతో పాటు ఇతర అవసరమైన వసతులు కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ భవనాలు ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఐటీ మరియు ఐటీఈఎస్ సంస్థలు, కాల్ సెంటర్లు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు వంటి వాణిజ్య కార్యకలాపాలకు అనుకూలంగా రూపకల్పన చేయబడ్డాయని తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు లేదా సంస్థలు జీవీఎంసీ తూర్పు జోన్ కార్యాలయంలో కార్యాలయ పని దినాల్లో సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని జోనల్ కమిషనర్ సూచించారు.



## యువతకు మార్గదర్శకంగా

# పోలీసుల అవగాహన కార్యక్రమం





**పెందుర్తి, సిటిజన్ టైమ్స్, మే:04**

యువతను సరైన దిశలో నడిపించేందుకు, నేరాలపై అవగాహన కల్పించేందుకు పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పెందుర్తి ఇన్‌స్పెక్టర్ శ్రీ కె.వి. సతీష్ కుమార్ మార్గదర్శకత్వంలో సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ షేక్ జిలాని చిన్నముసిడివాడలోని డేటా ప్రో కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్, సైబర్ నేరాలు, డ్రగ్స్ వంటి అసాంఘిక కార్యకలాపాల వల్ల కలిగే తీవ్రమైన పరిణామాలు, చట్టపరమైన శిక్షలు, వ్యక్తిగతంగా మరియు కుటుంబపరంగా ఎదురయ్యే నష్టాలపై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. యువత అప్రమత్తంగా ఉండి ఇలాంటి నేరాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకుని తమ భవిష్యత్తును సుస్థిరంగా నిర్మించుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సైబర్ నేరాలపై ప్రత్యేక జాగ్రత్త అవసరమని, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. సమాజంలో శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసు శాఖ పాత్ర కీలకమని, ప్రజల రక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నారని తెలిపారు. యువతలో చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు మంచి స్పందన వ్యక్తం చేస్తూ, పోలీసులు ఇచ్చిన సూచనలను పాటిస్తామని తెలిపారు.

## రుషికొండ బీచ్‌లో జలక్రీడల జోష్ - యువతకు ప్రత్యేక శిక్షణ




**ఋషికొండ, సిటిజన్ టైమ్స్, మే :04**

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఎస్ఎపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా, రుషికొండ బీచ్‌లో జలక్రీడా శిక్షణ శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్న ఈ శిబిరం మే 1వ తేదీ నుంచి ప్రారంభమై, యువ క్రీడాకారులకు ప్రాయోగిక శిక్షణ అందిస్తోంది. ఈ శిబిరంలో కాయకింగ్, కనోయింగ్, సర్ఫింగ్, స్విమ్మింగ్ వంటి జలక్రీడలపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. అనుభవజ్ఞులైన ఎస్ఎపి కోచ్ వాసుపల్లి దాస్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ప్రాక్టికల్ ట్రైనింగ్‌తో పాటు సమతుల్యత, భద్రతా ప్రమాణాలు, నీటిలో అవసరమైన నైపుణ్యాలపై సమగ్ర మార్గదర్శకత్వం అందిస్తున్నారు. బీచ్ వద్ద జరుగుతున్న ఈ శిక్షణలో చిన్నారులు, యువకులు ఉత్సాహంగా పాల్గొంటూ తమ ప్రతిభను మెరుగుపరుచుకుంటున్నారు. ముఖ్యంగా సర్ఫింగ్ శిక్షణలో అవసరమైన బ్యాలెన్స్, ధైర్యాన్ని కోచ్ ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా నేర్పించడం పాల్గొనేవారిలో ఆసక్తిని పెంచుతోంది. నిర్వాహకులు మాట్లాడుతూ, చిన్న వయస్సు నుంచే జలక్రీడలపై ఆసక్తి పెంపొందిస్తే భవిష్యత్తులో రాష్ట్రం, దేశానికి ప్రతిభావంతులైన క్రీడాకారులు ఎదుగుతారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇలాంటి శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనడానికి ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జూన్ మాట్లాడుతూ, ఈ శిబిరం ద్వారా విశాఖపట్నం జిల్లాలో జలక్రీడలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని, భవిష్యత్తులో మరిన్ని ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# గంజాయి కేసులో కఠిన తీర్పు

## ఇద్దరికి 10 ఏళ్ల జైలు

**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, మే :04**

జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్న పోలీసులు సాధించిన కీలక విజయంగా, 2015లో నమోదైన ఓ కేసులో చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. చీడికాడ పోలీస్ స్టేషన్ పరిధిలో బైలపూడి గ్రామ సమీపంలో 100 కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను 2015 ఆగస్టు 7న పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసును అప్పటి సబ్ ఇన్‌స్పెక్టర్ ఏ. కోటేశ్వరరావు శాస్త్రీయంగా దర్యాప్తు చేసి పక్కా ఆధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ఎం. హరి నారాయణ నిందితులు జాజిమొగ్గల సత్తిబాబు (పెంటయ్య) (39), గోకడ చెల్లుబాబు (28) పై నేరం రుజువైందని తేల్చి, ఎన్.డి.పి. ఎస్ చట్టం కింద ఒక్కొక్కరికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,00,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 2 సంవత్సరాల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు. ఈ కేసులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చీపురుపల్లి సూర్యనారాయణ, దర్యాప్తు అధికారి ఎస్సై ఏ. కోటేశ్వరరావు, చీడికాడ పోలీస్ సిబ్బంది మరియు కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులను అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు. "చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని, ఈ తీర్పు అక్రమార్కులకు గట్టి హెచ్చరిక" అని ఎస్పీ స్పష్టం చేశారు.



## బాధితుల సమస్యలకు 7 రోజుల్లో పరిష్కారం: అదనపు ఎస్పీ సౌమ్యలత



**విజయనగరం, సిటిజన్ టైమ్స్, మే :04**

బాధితుల సమస్యలను చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించాలని అదనపు ఎస్పీ పి. సౌమ్యలత సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టమ్) కార్యక్రమంలో ఆమె ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను శ్రద్ధగా విన్న అదనపు ఎస్పీ, వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ఫిర్యాదుల పట్ల సానుకూలంగా స్పందిస్తూ, వాటిని చట్టపరంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 21 ఫిర్యాదులు స్వీకరించగా, వాటిలో భూవివాదాలకు సంబంధించినవి 10, కుటుంబ కలహాలకు సంబంధించినవి 2, మోసాలకు సంబంధించినవి 2, ఇతర అంశాలకు సంబంధించినవి 7 ఫిర్యాదులు ఉన్నాయి. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, వాస్తవాలు నిర్ధారించిన తరువాత చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ద్వారా అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ పూర్తి చేసి, 7 రోజుల్లో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ పేర్కొన్నారు. అలాగే తీసుకున్న చర్యలపై నివేదికలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ కె. కుమారస్వామి, ఎస్ఐలు రాజేష్, ప్రభావతి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంకి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1 కోటి రుడా నిధులు ..

**రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు....**

**రావులపాలెం, సిటిజన్ టైమ్స్, మే 04:**



కోనసీమ తిరుమల వాడ పల్లిలో పార్కింగ్ ప్రదేశం నుంచి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం వరకు బీటీ రోడ్డు, సీసీ బేస్ నిర్మాణానికి, వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ఏటిగట్టు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1 కోటి రుడా నిధులు మంజూరు అయ్యాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. వాడపల్లి అభివృద్ధికి రుడా నిధులు కేటాయించిన రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే పనులు మొదలుపెట్టనున్నట్లు ఆయన తెలిపారు. వాడపల్లి అభివృద్ధికి నిధులు కేటాయించిన రుడా చైర్మన్, నిధులు మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావులకు వాడపల్లి దేవస్థానం పాలకమండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు మరియు పాలకమండలి సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మే 5న జీవీఎంసీ సౌత్ జోన్‌లో బహిరంగ వేలం నిర్వహణ



**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, మే :04**

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ) సౌత్ జోన్ పరిధిలోని షాపు రూములు, రెండు కళ్యాణ మండపాలు, మూడు మార్కెట్లను లీజు విధానంలో అప్పగించేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సౌత్ జోనల్ కమిషనర్ ఎమ్. మల్లయ్య నాయుడు తెలిపారు. గజిట్ నోటిఫికేషన్ నెం.18/2026 మరియు అత్యవసర షార్ట్ నోటీసు తేదీ 17.03.2026లో పేర్కొన్న షరతులు, నిబంధనల మేరకు, సంబంధిత ఆస్తులను అప్పగించిన తేదీ నుండి మూడు సంవత్సరాల కాల పరిమితికి లీజు గుత్తగా ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బహిరంగ వేలం మే 5వ తేదీ ఉదయం 11:00 గంటలకు సౌత్ జోన్ కార్యాలయంలో, జీవీఎంసీ కమిషనర్ కెతన్ గార్గ్ ఆదేశాల మేరకు నిర్వహించబడుతుందని తెలిపారు. కావున ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు ఈ వేలం పాటలో పాల్గొని అవకాశాన్ని వినియోగించుకోవాలని సౌత్ జోనల్ కమిషనర్ కోరారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, సిటిజన్ టైమ్స్, మే 04**

ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. రామచంద్రపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల విభాగం ద్వారా ఈ కార్యక్రమం జరిగింది. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి పెద్ద ఎత్తున అర్జీదారులు తరలివచ్చి తమ సమస్యలను మంత్రికి వినిపించారు. మొత్తం 60 అర్జీలు అందగా, వాటిలో పెన్షన్లు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, సిమెంట్ రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణాలు చేపట్టాలని కోరుతూ వినతులు అందజేశారు. అర్జీలను మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు వెంటనే స్పందించి సమస్యలు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలు పరిష్కారం కావడం ప్రభుత్వ ప్రధాన



ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, టిడిపి రాష్ట్ర బీసీ సెల్



నాయకులు పెంకే సాంబశివరావు, దంగేటి గౌరీ శంకర్, వనుం వీరబ్రహ్మాం, చిర్రా సురేష్, కట్టా నాగేశ్వరరావు, కాటే సుబ్రమణ్యం, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుల స్వీకరణ

**సత్వర పరిష్కారానికి జిల్లా ఎస్పీ ఆదేశాలు.**



**కాకినాడ (సిటిజన్ టైమ్స్) మే 4**

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ మొత్తం 41 ఫిర్యాదులను స్వీకరించారు.వాటిలో భూ తగాదాలు - 8, కుటుంబ కలహాలు -- 13 మరియు ఇతర విభాగాలకు చెందినవి-- 20గుర్తించబడ్డాయి.ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులను ఆదేశిస్తూ, “ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, 7 రోజుల లోపు విచారణ పూర్తిచేసి, తగిన పరిష్కారం చూపాలని, వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విన్న ఎస్పీ ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని, ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించడంలో కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి నిబద్ధతతో పని చేస్తున్నారని తెలిపారు.

## ప్రజావాణికి 35 ఫిర్యాదులు

**ప్రజావాణి ఫిర్యాదులను సత్కారమే పరిష్కరించండి**

**అదనపు కలెక్టర్ అమరేందర్**



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ మే 4**

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అమరేందర్ అధికారులకు సూచించారు. నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ తో కలిసి అదనపు కలెక్టర్ అమరేందర్ ప్రజల నుంచి 35, అర్జీలు స్వీకరించారు. అదనపు కలెక్టరు మాట్లాడుతూ..... ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీఏ కూటమితోనే దేశాభివృద్ధి సాధ్యం...

**వివిధ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఈ నిజాన్ని నిరూపించాయి...**

**దేశానికి మోదీ విజన్, రాష్ట్రానికి చంద్రబాబు విజన్...**

**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...**



**రావులపాలెం, సిటిజన్ టైమ్స్, మే 04**

ఎన్డీఏ కూటమితోనే దేశాభివృద్ధి సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో మూడు రాష్ట్రాల్లో ఎన్డీఏ విజయం సాధించిన సందర్భంగా తెలుగుదేశం క్యాంపు కార్యాలయంలో సంబరాలు జరిపారు. నేతలకు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ తోనే రాష్ట్రాల అభివృద్ధి, దేశ ప్రగతి సాధ్యమన్నారు.తాజా ఎన్నికల ఫలితాలే దీనికి నిదర్శనమన్నారు. కేంద్రంలో,రాష్ట్రంలో బలమైన, సుస్థిర ప్రభుత్వాలతోనే రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ ప్రతిష్ఠ ప్రపంచ స్థాయిలో ఇనుమడించిందని వ్యాఖ్యానించారు. దేశానికి మోదీ విజన్, రాష్ట్రానికి చంద్రబాబు విజన్ సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు.

## ప్రజా ఫిర్యాదులపై తక్షణ, నిబద్ధతతో చర్యలు చేపట్టాలి: ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి







**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్, మే:04**

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును నిబద్ధతతో పరిశీలించి, చట్టపరంగా వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులతో ఎస్పీ ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను సమగ్రంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 79 ఫిర్యాదులు స్వీకరించబడ్డాయి. ప్రతి ఫిర్యాదును చట్టపరమైన కోణంలో విచారించి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో వెంటనే ఫోన్ ద్వారా సంప్రదించి విచారణ ప్రారంభించాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. అలాగే ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు, పురోగతి వివరాలను సమయానుకూలంగా నివేదిక రూపంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, మోసపూరిత వ్యవహారాలు, ఆస్తి తగాదాలు, సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు సహా మొత్తం 79 వినతులు స్వీకరించబడ్డాయి.

## “మీ భూమి - మీ హక్కు” రీ సర్వే పాస్ పుస్తకాల పంపిణీ

**-రైతులకు రాజముద్ర తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసిన దెందులూరు ఎమ్మెల్యే**





**గాలాయి గూడెం:( సిటిజన్ టైమ్స్ ): మే:04:**

దెందులూరు మండలం గాలాయగూడెం గ్రామంలో సోమవారం నాడు “మీ భూమి -- మీ హక్కు” కార్యక్రమంలో భాగంగా రీ సర్వే అనంతరం ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పాస్ పుస్తకాలను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కూటమి నేతలతో కలిసి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రీ సర్వే ద్వారా భూములపై స్పష్టమైన హక్కులు రైతులకు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ రాజముద్రతో ఇచ్చే పాస్ పుస్తకాలు రైతులకు భద్రత, నమ్మకం కలిగిస్తాయని తెలిపారు..గత వైసిపి పాలనలో రైతుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తూ అహంకారంతో కూడిన విధానంతో తమ ఫోటోలను ప్రచురించి రైతులకు పాస్ పుస్తకాలు ఇవ్వడం వారి అహంకారానికి ప్రతీక అని, కూటమి ప్రభుత్వంలో రైతుల ఆత్మ అభిమానానికి ప్రాధాన్యతిస్తూ స్పష్టమైన వివరాలతో కూడిన రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వడం కూటమీ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అని తెలిపారు.... ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదలకు అండగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది



**తాడేపల్లిగూడెం:( సిటిజన్ టైమ్స్): మే:04:**

రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక విధి కార్యాలయంలో సోమవారం 97మంది లబ్దిదారులకు రూ. 68లక్షలు పైగా విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా భారీ మొత్తంలో ముఖ్యమంత్రి సహాయ నిధిని చంద్రబాబు అందజేస్తున్నారని, పేదల పట్ల ఆయన మంచి హృదయానికి నిదర్శనమని అన్నారు. గత రెండేళ్ల తాడేపల్లిగూడెం నియోజవర్గానికి సుమారు రూ 6 కోట్లకు పైగా సహాయ నిధి వచ్చిందన్నారు. గత వైసిపి హయాంలో పరిస్థితి దారుణంగా ఉండేదని అసలు సహాయనిధి చెక్కు ఎప్పుడు వస్తుందో కూడా తెలియని అయోమయ పరిస్థితి ఉండేది అన్నారు.కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ రెండేళ్లలో దాదాపు రూ.1000 కోట్ల కు పైగా ముఖ్యమంత్రి సహాయనిధి అందజేశామని అన్నారు. మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే మంచి జరుగుతుందని, అందుకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలే నిదర్శనమని అన్నారు. గత ఐదేళ్లలో వైసిపి చేసిన విధ్వంసం నుంచి బయటపడి రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మరో 15 సంవత్సరాల పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాలని అన్నారు. ప్రజలు ఈ విషయాలను గమనించి మంచి ప్రభుత్వానికి అండదండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ కీలకం

### ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

**కాకినాడ(సిటిజన్ టైమ్స్)మే 4**

ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సత్వర పరిష్కారం చూపేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. సోమవారం కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన కార్పొరేషన్ అధికారులతో కలిసి పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వయంగా స్వీకరించారు. ఈ ప్రజా దర్బార్ లో సుమారు 140 అర్జీలు అందగా, వాటిని వేగవంతంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆదేశించారు. వితంతు, దివ్యాంగుల పెన్షన్ కొరకు, ఇల్లు స్థలాలు కోసం, త్రాగునీటి సమస్యలు, వీధి దీపాల పనితీరు లోపాలు, డ్రైనేజీల శుభ్రత వంటి అనేక సమస్యలపై వివిధ డివిజన్ల నుంచి ప్రజలు భారీగా హాజరై తమ అర్జీలను సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు అందజేశారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వనమాడి అధికారులను సూచించారు. ముఖ్యంగా త్రాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలు, వితంతు పెన్షన్ల వంటి అంశాలపై ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇక నగరంలో డ్రైనేజీ వ్యవస్థ పరిరక్షణలో ప్రజల సహకారం అవసరమని ఆయన అన్నారు.



కాలువలపై కాంక్రీట్ నిర్మాణాలు చేయడం, కాల్వలను ఆక్రమించుకునే నిర్మాణాలు చేయడం వల్ల డ్రైనేజీ శుభ్రపరిచే పనులు కష్టతరమవుతున్నాయని, డ్రైనేజీలను ప్రజలే సంరక్షించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలపై అధికారులు ఫోన్ ద్వారా కూడా స్పందిస్తున్నారని, అవసరమైనప్పుడు నేరుగా సంప్రదించాలని, అలాగే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్, టీపీఆర్వో శైలజ, డీఈ మత్యరాజు, డి సి పి కృష్ణారావు, శానిటేషన్ సూపర్వైజర్లు నాయుడు, రాంబాబు, హౌసింగ్ ఏడీ, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఇరువురు పేద మహిళలకు అండగా మంత్రి సుభాష్

**రూ.10,000 ఆర్థిక సహాయం**





**రామచంద్రపురం, సిటిజన్ టైమ్స్, మే 04:**

రామచంద్రపురం నియోజకవర్గంలో పేద మహిళలకు అండగా నిలుస్తూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన మనసున్న నాయకత్వాన్ని చాటుకున్నారు. అముజూరు గ్రామానికి చెందిన సంగం దేవి భర్త లేకపోవడంతో చిన్న పిల్లలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆమె పరిస్థితిని గుర్తించిన మంత్రి సుభాష్, పింఛన్ మంజూరు అయ్యే వరకు ప్రతి నెల రూ.5,000 ఆర్థిక సహాయం అందిస్తానని గత నెల హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ హామీని నిలబెట్టుకుంటూ ఈ నెల కూడా రూ.5,000 అందజేశారు. అలాగే స్థానిక ఏడో వార్డుకు చెందిన అయినవిల్లి స్వర్ణకు కూడా పింఛన్ వచ్చేవరకు ప్రతినెల రూ.5,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తానని ఇచ్చిన మాటను మంత్రి సుభాష్ అమలు చేశారు. ఈ మేరకు ఇరువురు మహిళలకు కలిపి మొత్తం రూ.10,000 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మంత్రి సుభాష్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమలాంటి ఆపన్నులకు అండగా నిలుస్తున్న మంత్రి సేవలు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# సస్పెన్స్‌లో 'అఖండ 2' తర్వాతి ప్రాజెక్ట్!







బాక్సాఫీస్ వద్ద మాస్ జాతర చేయాలన్నా, థియేటర్లలో రీసౌండ్ బద్దలవ్వాలన్నా అది ఒక్క బోయపాటి శ్రీనుకే సాధ్యం. నేడు పుట్టినరోజు జరుపుకుంటున్న ఈ 'మాస్ డైరెక్టర్'కు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, ఇటు కోలీవుడ్, అటు బాలీవుడ్ నుంచి కూడా భారీ ఆఫర్లు క్యూ కడుతున్నాయి. 'అఖండ 2' తర్వాత ఈ క్రేజీ డైరెక్టర్ ఎవరితో జతకట్టబోతున్నారు? తదుపరి ప్రాజెక్ట్ విశేషాలేంటి? వంటి ఆసక్తికర విషయాలు తెలుసుకోవడానికి అభిమానులంతా వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

**సస్పెన్స్‌లో 'అఖండ 2' తర్వాతి ప్రాజెక్ట్:**

నందమూరి బాలకృష్ణతో కలిసి 'అఖండ 2' వంటి భారీ చిత్రాన్ని పట్టాలెక్కించిన బోయపాటి, తన తర్వాతి సినిమా విషయంలో మాత్రం ఎవరూ ఊహించని విధంగా సస్పెన్స్ మెయింటైన్ చేస్తున్నారు. సాధారణంగా ఒక సినిమా సెట్స్ మీద ఉండగానే తర్వాతి ప్రాజెక్ట్‌ను లైన్‌లో పెట్టే ఆయన, ఈసారి మాత్రం కొంత గ్యాప్ తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషలకు సంబంధించిన క్రేజీ కథలు ఉన్నాయి. బెటర్ ఆప్షన్ కోసం ఎదురుచూస్తున్న బోయపాటి, మరో వారం రోజుల్లో తన తర్వాతి హీరో ఎవరనే దానిపై స్పష్టత ఇచ్చే అవకాశం కనిపిస్తోంది.

ఒకప్పుడు కేవలం తెలుగు సినిమాలకే పరిమితమైన బోయపాటి మార్క్ యాక్షన్, ఇప్పుడు పాన్ ఇండియా లెవల్‌లో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. అందుకే తమిళ స్టార్ హీరో సూర్యతో పాటు టాలీవుడ్ అగ్ర హీరోలు అల్లు అర్జున్, రామ్ చరణ్‌లతో కూడా ఈయన ప్రాజెక్ట్ ఉండవచ్చని ఫిలిం నగర్ ఎప్పటినుండో టాక్. అంతేకాదు, బాలీవుడ్‌లోని ఒక బడా నిర్మాణ సంస్థ బోయపాటి యాక్షన్ స్టైల్ పట్ల ఆసక్తి చూపిస్తోంది. ఇక పక్కా మాస్ ఎమోషన్‌తో కూడిన కథను సిద్ధం చేయమని ఆయనకు ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మొత్తం మీద బోయపాటి నెక్స్ట్ మూవీ ఏదైనా అది పాన్ ఇండియా లెవల్‌లో ఉండటం ఖాయం.

**యాక్షన్ వెనుక ఉన్న ఎమోషనల్ సెంటిమెంట్:**

బోయపాటి సినిమా అంటే కేవలం గాలిలో ఎగిరిపడే విలన్లు, పవర్‌ఫుల్ డైలాగులు మాత్రమే కాదు. ఆయన కథల్లో గుండెల్ని పిండేసే బలమైన ఫ్యామిలీ ఎమోషన్ కూడా ఉంటుంది. మొదటి సినిమా 'భద్ర' నుంచి మొన్నటి సినిమాల వరకు ఇదే ఫార్ములాను ఆయన సక్సెస్‌ఫుల్‌గా వాడుతున్నారు. ముఖ్యంగా క్యారెక్టర్లను డిజైన్ చేయడంలో ఆయనకు ఒక ప్రత్యేక శైలి ఉంది. హీరోలను అత్యంత శక్తివంతంగా చూపించడమే కాదు, జగపతిబాబు వంటి వారిని పవర్‌ఫుల్ విలన్లుగా మార్చి వారి కెరీర్‌ను మలుపు తిప్పిన ఘనత కూడా బోయపాటిదే.

**త్వరలోనే రాబోతున్న భారీ ప్రకటన:**

ప్రస్తుతం బోయపాటి శ్రీను తన పుట్టినరోజు వేడుకల్లో భాగంగా అభిమానుల శుభాకాంక్షలతో మునిగిపోయారు. 'అఖండ 2' తర్వాత ఆయన రేంజ్ మరింత పెరగడంతో, ప్రతి ఒక్కరి చూపు ఆయన తదుపరి అడుగుపైనే ఉంది. సరైన హీరో, అంతకుమించిన పవర్‌ఫుల్ స్క్రిప్ట్ కోసం వెయిట్ చేస్తున్న ఈ మాస్ డైరెక్టర్, వచ్చే వారం ఇచ్చే అప్‌డేట్ బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టించడం గ్యారెంటీ. తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌తో సౌత్ టూ నార్త్ బాక్సాఫీస్‌ను ఎలా షేక్ చేస్తారో వేచి చూడాల్సిందే.

తెలుగు సినిమా స్థాయిని మాస్ యాక్షన్‌తో కొత్త శిఖరాలకు చేర్చిన బోయపాటి శ్రీను, తన అంకితభావంతో నేడు పాన్ ఇండియా లెవల్‌లో డిమాండ్ ఉన్న దర్శకుడిగా ఎదిగారు. ఇక ప్రయోగాలకు వెనకాడకుండా, ప్రేక్షకుల నాడి తెలిసిన ఈ మాస్ డైరెక్టర్ రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులను తిరగరాయాలని ఆశిద్దాం. హ్యాపీ బర్త్ డే టు బోయపాటి శ్రీను!



# పేరుకే 'అన్‌క్యాప్డ్'.. అదరగొట్టేస్తోన్న యంగ్ 'ప్లేయర్స్'!

ఎదురెదురుగా అంతర్జాతీయ ఆటగాడు - ఓ కుర్రాడు.. సాధారణంగా వీరిద్దరిలో ఎవరిది పైచేయి అవుతుందని అనుకుంటాం.. ఎంతో అనుభవం కలిగిన సదరు ఇంటర్నేషనల్ ప్లేయర్‌దే కదా.. కానీ, ఐపీఎల్ 2026 సీజన్‌లో కుర్రాళ్ల దెబ్బకు హేమాహేమీలే చిత్తైపోయారు. పేరుకే 'అన్‌క్యాప్డ్'.. ఒక్కసారి బరిలోకి దిగితే ప్రత్యర్థి ఫేడ్‌అవుట్. ఇదీ ప్రస్తుతం యువ క్రికెటర్ల ప్రదర్శన చూశాక ప్రతిఒక్కరి నోటా వినిపించే మాట.

వైభవ్ సూర్యవంశీ: ఈ పేరు కొత్తేం కాదు. గత సీజన్ నుంచి సంచలన ప్రదర్శనతో అదరహో అనిపిస్తున్నాడు. ప్రస్తుత ఎడిషన్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ఆడుతూ ఇప్పటికే 404 పరుగులు చేసిన వైభవ్.. టాప్ క్లాస్ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. ప్రియాంశ్ ఆర్య: అంతా వైభవ్, అభిషేక్ ఓపెనింగ్ గురించే ప్రస్తావిస్తారు కానీ.. వారిద్దరికి ఏమాత్రం తగ్గని ఆటగాడు ప్రియాంశ్ ఆర్య. పంజాబ్ కింగ్స్ విజయాల్లో అతడిదే కీలక పాత్ర. ఎనిమిది మ్యాచుల్లో 285 పరుగులు చేసిన ప్రియాంశ్ ఆర్య స్ట్రైక్‌రేట్ 247.82. ప్రస్తుతానికి ఇతడిదే అత్యధికం. ప్రభ్ సిమ్రన్ సింగ్: దిల్లీ క్యాపిటల్స్‌పై భారీ టార్గెట్ (265)ను పంజాబ్ కింగ్స్ ఛేదించిందంటే.. ప్రభ్‌సిమ్రన్ దూకుడే కారణం. మైదానం నలువైపులా షాట్లు కొట్టే ప్రభ్ 8 ఇన్నింగ్స్‌ల్లో 361 పరుగులు చేశాడు.

రఘువంశీ: కోల్‌కతా తరఫున ఈ సీజన్‌లో నిలకడగా ఆడుతోన్న ఒకేఒక్క ప్లేయర్ అంగ్‌క్రిష్ రఘువంశీ. వన్‌డౌన్ లేదా సెకండ్ డౌన్‌లో వస్తూ కేకేఆర్ ఇన్నింగ్స్‌ను నిలబెడుతోన్న రఘువంశీ ఇప్పటి వరకు 268 పరుగులు చేశాడు.

బ్యాటింగ్ విభాగంలో నమన్ ధిర్, సమీర్ రిజ్వీ, ఆయుష్ మాత్రే, ఆయుష్ బదోని, సలీల్ అరోరా, అనికేత్ వర్మ.. ఇలాంటి యువ క్రికెటర్లూ ఉన్నారు. వారితోపాటు తాజాగా హాఫ్ సెంచరీతో మెరిసిన కార్తిక్ శర్మనూ మరిచిపోకూడదు. అయితే, వీరంతా కొన్ని మ్యాచుల్లోనే ప్రభావం చూపించారు. ఆరంభంలో అదరగొట్టిన ఆయుష్ గాయం వల్ల లీగ్‌కే దూరమైన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు ముగిసిన మ్యాచుల్లో అన్‌క్యాప్డ్ బ్యాటర్లు దాదాపు 3వేలకు పైగా పరుగులు చేయడం గమనార్హం.

బౌలర్లూ సత్తా చాటి..

బ్యాటర్ల హవా కొనసాగే టీ20ల్లో యువ బౌలర్లకు పెద్ద సవాలే. స్టార్ పేసర్లు, స్పిన్నర్లకు అనుభవం ఎక్కువ కాబట్టి నెగ్గుకురాగలరు. కానీ, మేం కూడా తక్కువ కాదని భారత యువ బౌలర్లు అదరగొట్టారు. పర్పుల్ క్యాప్ రేసులో సీనియర్లతోపాటు అన్షుల్ కాంబోజ్ (17 వికెట్లు) ముందున్నాడంటే అతడి ప్రభావం ఎలాఉందో అర్థం చేసుకోవచ్చు. చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రధాన పేసర్‌గా మారాడు. ప్రిన్స్ యాదవ్ మరో సంచలనం. పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బౌలింగ్ ఎటాక్‌ను నడిపిస్తోంది ప్రిన్స్ యాదవ్, మోసిన్ ఖాన్. స్లో బంతులతో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేయడంలో ప్రిన్స్ స్పెషలిస్ట్‌గా మారాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 13 వికెట్లు ఉండగా.. మోసిన్ 9 వికెట్లు పడగొట్టాడు. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కొత్త జోష్ తెప్పించిన ప్రఫుల్ హింగే, సకిబ్ హుస్సేన్ ఈ 'అన్‌క్యాప్డ్' బెస్ట్ బౌలర్ల జాబితాలో చోటు సంపాదించారు.

# సీఎస్కే ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్..
## మరో మ్యాచ్‌కూ ధోని దూరం



మహేంద్రసింగ్ ధోని ఆటను ఎప్పుడెప్పుడూ చూద్దామా అని ఆశపడుతున్న అభిమానులకు బ్యాడ్ న్యూస్. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచూ ఆడని ధోని మరో పోరుకు దూరం కానున్నాడు. మే5న దిల్లీ క్యాపిటల్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ తలపడనుంది. ఈ మ్యాచ్‌కు మహి అందుబాటులో ఉండటం లేదు. పిక్క కండరం గాయంతో ఇబ్బందిపడుతున్న ధోని.. చెన్నైలోనే ఉండిపోయాడు. దీంతో సీఎస్కే, ధోని అభిమానులు నిరాశ చెందుతున్నారు. ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్‌లోనైనా 'తలా' ఆటను చూస్తామా? లేదా అని వారు కంగారుపడుతున్నారు. ఐపీఎల్ 2026 మొదలైనప్పటి నుంచి ధోని పిక్క గాయంతో బాధపడుతున్నాడు. సీజన్ మధ్యలో పూర్తి ఫిట్‌నెస్‌కు చేరువయ్యాడు. ఈ క్రమంలోనే వార్మప్ మ్యాచ్‌లో మరోసారి అతను గాయం బారినపడ్డాడు. ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఇప్పటివరకు 9 మ్యాచ్‌లు ఆడి నాలుగింట విజయం సాధించింది. ప్రస్తుతం ఆరో స్థానంలో ఉన్న సీఎస్కే.. మిగిలిన ఐదు మ్యాచ్‌ల్లో కనీసం నాలుగు మ్యాచుల్లో గెలిస్తే ప్లేఆఫ్స్ చేరడానికి అవకాశం ఉంటుంది.

# మేం రెండోది గెలవాలనుకుంటున్నాం
## -జెమీమా రోడ్రిగ్స్



ఇంగ్లాండ్ వేదికగా జూన్‌లో మహిళల టీ20 ప్రపంచ కప్ మొదలుకానుంది. ఇప్పటికే టీమ్‌ఇండియాను బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. ఇటీవలే వన్డే ప్రపంచ కప్‌ను గెలిచిన భారత్ మంచి జోష్ మీదుంది. తాము రెండో కప్‌ను గెలుచుకోవాలని అనుకుంటున్నట్లు మహిళా క్రికెటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. అమోల్ మజుందార్‌తో కలిసి ఆమె ఐఐఎస్‌ఎంలో డిగ్రీల ప్రదాన కార్యక్రమంలో పాల్గొంది. ఈ సందర్భంగా టీమ్ ప్రిపరేషన్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "మేం ఇంతకుముందు ఒక ఐసీసీ ట్రోఫీ నెగ్గాం. రెండో దానిని కైవసం చేసుకోవాలనే స్ఫూర్తితో బరిలోకి దిగుతాం. మా సన్నద్ధత చాలా బాగుంది. ఇదేమీ స్క్వాడ్ ప్రకటన అనంతరం మొదలుకాలేదు. గతేడాది వన్డే ప్రపంచ కప్ తర్వాతనే ప్రారంభించాం. శ్రీలంకతో సిరీస్ సమయంలో మా కోచ్ అమోల్ మజుందార్ ఓ మాట చెప్పారు. 'ఇప్పుడు టీ20 ప్రపంచకప్ సన్నద్ధతలో తొలి రోజు మొదలవుతోంది. అదే లక్ష్యంతో ప్రతి మ్యాచ్ ఆడాలి' అని అన్నారు. జట్టులోని ప్రతి క్రికెటర్ ఇదే భావనతో ఉన్నాం. నందని ఈసారి కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నా. ఏదో ఒక మ్యాచ్‌లో బాగా ఆడి ఆమె తనను ప్రూవ్ చేసుకోలేదు. మొదట్నుంచి నిలకడగా ఆడుతోంది. ఎంతో అనుభవం కలిగిన ప్లేయర్లు ఉన్నారు. వారి నేతృత్వంలో భారీ వేదికపై మెరుపులు మెరిపిస్తుందని ఆశిస్తున్నా" అని జెమీమా తెలిపింది. టీ20 ప్రపంచ కప్‌లో భారత్ ప్రయాణం జూన్ 14న పాకిస్థాన్ మ్యాచ్‌తో మొదలవుతుంది. ఈ గ్రూప్‌లో ఈ రెండు జట్లు మాత్రమే కాకుండా.. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, శ్రీలంక కూడా ఉన్నాయి.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776